ప్రజాశక్తి
ఆదివారం 14 జనవరి 2024
5
కర్నూలు

కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

అంగన్వాడీలతో చర్చలు జరపాలి

- 33వ రోజు సమ్మె

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్ : అంగన్‌వాడీల సమస్యలపై ముఖ్యమంత్రి , మంత్రులు, సంబంధిత అధికారులతో చర్చలు జరపాలని, సలహాదారులతో జరిపి అవమానించవద్దని సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు అన్నారు. ధర్నా చౌక్‌లో అంగన్వాడీల 24 గంటల దీక్షలు శనివారం కూడా చేపట్టారు. అంగన్‌వాడీల సమ్మె 33వ రోజుకు చేరింది. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, అంగన్వాడీ జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.నిర్మల, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పిఎస్.రాధాకృష్ణ, ఎండి.అంజిబాబు,ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప నగర కార్యదర్శి ఎ.చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిన్న జరిపిన చర్చలు అంగన్వాడీలను అవమానకరంగా చేసే విధంగా జరిగాయని తెలిపారు. సంబంధిత శాఖ మంత్రి, ఇతర మంత్రులు పాల్గొనకుండా సలహా దారునితో చర్చలు జరపడం ఏంటని వారు ప్రశ్నించారు. ఆరు దఫాలుగా జరిగిన చర్చల్లో జీతాల విషయం మాట్లాడితే ఆ విషయం గురించి మాట్లాడకుండా పది డిమాండ్లు నెరవేర్చాం ఇంకొక డిమాండ్ నెరవేర్చాలని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రధాన డిమాండ్‌గా జీతాలు పెంచడమేనని అన్నారు. ప్రభుత్వం జీతాలు పెంచమంటే ఇది సరైన సమయం కాదని, ఐదు సంవత్సరాలకు ఒకసారి జీతాలు పెంచుతామని, వచ్చే ఏప్రిల్ నెలలో జీతాలు పెంచుతామని చెప్పడం సరైందికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చి ఎప్పుడు పెంచుతారనే విషయాన్ని యూనియన్ నాయకులతో చర్చించాలన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు ఇ.రాజు, సుంకన్న, సుబ్బరాయుడు, చిట్టి, లోకేష్, రాంబాబు, వారిబృందం కళారూపాల ద్వారా ఆటపాటల ద్వారా అంగన్వాడీలను ఉత్సాహపరిచి వారి సమ్మెకు సంఘీభావం తెలిపారు. సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.విజయరామాంజనేయులు, కె.రామకృష్ణ, కె.సుధాకరప్ప, ఎస్.మహమ్మద్ రఫీ, ఎఐటియుసి నాయకులు రామాంజనేయులు, అంగన్వాడీ అధ్యక్షులు బి.రేణుక, అంగన్వాడి టీచర్లు ఆయాలు పాల్గొన్నారు. దీక్షలలో కర్నూలు అర్బన్ 4వ సెక్టార్ నుండి అంగన్వాడీలు టిఎస్ విజయలక్ష్మి, ఎం.సుమలత, స్రవంతి, నాగమణి, వై.లక్ష్మీదేవి, పి కనకమ్మ, స్వర్ణకుమారి, హైమావతి, రేణుక, కె.వెంకటలక్ష్మి, ఈదమ్మ, సావిత్రి, సుజాత బాయ్, మునిరాబి, నాగమణి, శివకుమారి, వహీదా, అరుణ, నాగ శేషమ్మ, మంజుల దీక్షలో కూర్చున్నారు.

అంగన్‌వాడీల సమ్మెనుద్దేశించి ఆటపాటతో మద్దతు తెలుపుతున్న పిఎన్ఎం కళాకారులు

బస్సు కోసం బస్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

ప్రయాణికులతో
ఆర్‌టిసి బస్టాండ్ కిటకిట

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని తమ సొంత గ్రామాలకు ప్రయాణికులు వెళుతుండడంతో కర్నూలు ఆర్‌టిసి బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. ఆర్‌టిసి సంక్రాంతి పండగను పురస్కరించుకొని ప్రత్యేక బస్సులను అదనంగా నడుపుతున్నప్పటికీ ప్రయాణికులు సీట్లు లేక నిల్చుని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రయాణికులు బస్సుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదే అదునుగా రద్దీగా ఉండే ప్రాంతాల్లో దొంగలు ప్రయాణికుల పర్సులు, సెల్ ఫోన్లు, దొంగలిస్తున్నారు. బస్టాండులో ఉన్న పోలీసులు ప్రయాణికులకు హెచ్చరికలు చేస్తున్నప్పటికీ రద్దీలో ఎక్కే సమయంలో ఏమరపాటును అదునుగా చేసుకొని దొంగలు సామాన్లను తస్కరిస్తున్నారు. బస్టాండులో పెరిగిన రద్దీకి అనుగుణంగా ఆర్‌టిసి ప్రయాణికులకు బస్సులు నడపడంలో విఫలమైందని చెప్పవచ్చు. రద్దీ సమయాల్లో ఆర్‌టిసి అధికారులు బస్టాండుల్లో పోలీసుల సహకారం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బాలికపై అత్యాచారానికి పాల్పడిన
నిందితుని అరెస్టు చేయాలి

- పోలీసులపై చర్యలు తీసుకోవాలి
- కెవిపిఎస్, ఐద్వా డిమాండ్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన ముని రంగడును అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఐద్వా, కెవిపిఎస్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. కెవిపిఎస్ నగర కార్యదర్శి ఆంధ్ర గురుస్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఐద్వా, కెవిపిఎస్, కెజిబిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎన్.అలివేలు, ఎమ్‌డి.ఆనంద్ బాబు, ఎన్‌జి.కృష్ణ మాట్లాడారు. మహిళలు, పసిపిల్లలు, దళితులు, మైనారిటీలపై రోజురోజుకు జిల్లాలో దాడులు పెరుగుతున్నాయని తెలిపారు. దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామంలో మరో దారుణం జరిగిందన్నారు. ఏడేళ్ల బాలికను తల్లిదండ్రులు పనికి వెళ్లిన తర్వాత బోయ మునిరంగడు బయటికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడని తెలిపారు. రక్తపు మరకలతో ఏడుస్తున్న బాలికను తల్లిదండ్రులు విచారించి విషయం తెలుసుకున్నారన్నారు. చికిత్స నిమిత్తం కోడుమూరుకు వచ్చిన బాలిక బంధువులను పోలీసులు కేసు నమోదు పేరుతో కోడుమూరు పోలీసు స్టేషన్‌కు పిలిపించి, రాత్రి 11 గంటల వరకు స్టేషన్‌లోనే పెట్టుకోవడం దారుణమని తెలిపారు. న్యాయం చేయాలని తల్లిదండ్రులు కలెక్టరేట్ ముందు ఆందోళన నిర్వహిస్తుంటే, విచారణ పేరుతో హాస్పిటల్ అవుట్ పోస్టులో బాలికకు వైద్యం అందకుండా ఇబ్బందులకు గురి చేశారన్నారు. కలెక్టర్, ఎస్పీలు ఘటన ప్రాంతాన్ని సందర్శించడంతోపాటు, బాధితులను పరామర్శించి భరోసానివ్వాలని డిమాండ్ చేశారు. బాలికకు మెరుగైన వైద్యం అందించి బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలన్నారు. బోయ మునిరంగడును వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, లేకపోతే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు డి.విజయమ్మ, ఐద్వా నాయకులు షబానా, న్యాయవాది కె.రవికుమార్, ఐద్వా జిల్లా నాయకులు కెఎస్.పద్మ, వేణమ్మ, విజయ, అమీనా, కమ్రూన్, కెవిపిఎస్ నగర అధ్యక్షులు ఏసు రాజు, ఉపాధ్యక్షులు టి.లక్ష్మీనారాయణ, నాయకులు వీరన్న, బాధిత కుటుంబ సభ్యులు, పి.కోటకొండ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రమాదకర చట్టాలను వ్యతిరేకిద్దాం

- సెక్షన్ 106-(1)-(2) రద్దుకు పోరాటం
- రౌండ్‌టేబుల్ సమావేశంలో కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

భారతీయ న్యాయ సహిత(బిఎన్‌ఎస్) 2023 చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం వల్ల సెక్షన్ 106-(1).(2) కింద ప్రమాదం చేసిన డ్రైవర్ కు పది సంవత్సరాలు జైలు శిక్ష, రూ.పది లక్షల జరిమానాలకు డ్రైవర్లు గురవుతారని ఇలాంటి చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కోశాధికారి జె.దివాకర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కొత్త బస్టాండ్ సమీపంలోని కార్మిక కర్షక భవన్ సిఐటియు కార్యాలయంలో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు రియాజ్ అధ్యక్షతన నిర్వహించారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కోశాధికారి జె.దివాకర్, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిఎస్.రాధాకృష్ణ, ఎండి.అంజిబాబులు రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఇండియన్ పీనల్ కోడ్ 1860 కింద డ్రైవర్ ప్రమాదం చేస్తే 304 ఎ సెక్షన్ కింద రెండు సంవత్సరాలు జైలు రూ.1500 వేసేవారని చెప్పారు. బ్రిటిష్ కాలం నాటి చట్టాలను కాలరాస్తు కొత్త చట్టాలను పార్లమెంటులో ప్రవేశ పెడుతూ ప్రమాదకర సెక్షన్లను తీసుకువచ్చి డ్రైవర్ల జీవితాలతో ప్రభుత్వాలు చెలగాటం ఆడుతున్నాయన్నారు. భారతీయ న్యాయ సంహిత 2003 చట్టాన్ని అమలు చేయడం వల్ల ఆందోళన చెందిన ట్రక్ డ్రైవర్లు వివిధ రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేసి మెరుపు సమ్మెను చేయడం వల్ల ప్రభుత్వం దిగివచ్చి ప్రస్తుతానికి ఈ చట్టం అమలు చేయబోమని చెప్పారని, అయితే ఇప్పటికే ఈ చట్టాన్ని భారత రాష్ట్రపతి ఆమోద ముద్ర ఉన్నందున ఎప్పుడైనా ఈ చట్టం అమలయ్యే ప్రమాదం పొంచి ఉందని వారన్నారు. దేశానికి వెన్నెముక రైతు ఎలాగో దేశ ప్రజల అవసరాలను తీరుస్తున్న రవాణా రంగ డ్రైవర్లు కూడా అలాంటి వారేనని అన్నారు. డ్రైవర్ల జీవితాలతో చెలగాటమాడే ఈ చట్టాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని లేకుంటే రానున్న కాలంలో దశల వారి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అందుకు డ్రైవర్ల అందరూ సిద్ధంగా ఉండాలని వారు పిలుపునిచ్చారు. ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు బి.రాధాకృష్ణ, కార్యదర్శి మహమూద్, రవి, స్కూల్ బస్ వర్కర్స్ యూనియన్ నాయకులు సిద్ధయ్య, హెయిర్‌బస్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీను మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టం ప్రతి డ్రైవర్‌కు వర్తిస్తుందన్నారు. పోరాటాల్లో భాగంగా ఈనెల 22న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా అనంతరం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు గంగాధర్, హెయిర్‌బస్ వర్కర్స్ యూనియన్ శ్రీను, చాందు, మినీ లారీ వర్కర్స్ యూనియన్, ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు ఆంజనేయులు, దేవరాజు, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు రవి, డిసిఎం డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్ నాయకులు నిసార్ అహ్మద్, రసూల్ లారీ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు వివిధ రంగాల డ్రైవర్లు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల సమావేశంలో మాట్లాడుతున్న జె.దివాకర్

ఆందోళన బాట...

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

జిల్లావ్యాప్తంగా పలు రంగాలకు చెందిన ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. గత కొన్ని రోజులుగా నిరవధిక సమ్మెలను కొనసాగించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలని, వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని, గర్భిణులకు, పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వడం కోసం అదనపు నిధులు కేటాయించాలని అంగన్వాడీలు నిరవధిక సమ్మె చేపడుతున్నారు. నెల రోజులుగా అనేక రూపాల్లో నిరసనలు తెలియజేస్తున్నారు. వంటావార్పు, ఒంటికాలిపై నిలబడి, మెడకు ఉరితాళ్లు బిగించుకున్నట్లు నిరసన వ్యక్తం చేస్తున్నారు. మానవహారాలు, పొర్లుదండాలు, మోకాళ్లపై నిలబడి వివిధ రూపాల్లో నిరసన తెలియజేశారు. ఎంపీ, ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడించారు. విగ్రహాలకు, దున్నపోతులకు వినతి పత్రాలు సమర్పించారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు. అంగన్వాడీలకు టిడిపి, సిపిఎం, సిపిఐ, జనసేన పార్టీలు, కార్మిక, రైతు, ప్రజాసంఘాలు, ఎపిడబ్ల్యుజెఎఫ్ మద్దతు తెలిపాయి. న్యాయమైన డిమాండ్లను సాధించుకునేంత వరకూ పోరాటం సాగించాలని, మీ వెంట మేముంటామని భరోసానిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్‌ఎస్‌ఎలో పని చేస్తున్న ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టారు. ఎంటిఎస్ ఇచ్చిన మూడు జిఒలను అమలు చేయాలని, 62 సంవత్సరాలు సర్వీసు కొనసాగించాలని, మెటర్నిటీ లీవులతో కూడిన వేతనాలు, రూ.26 వేల కనీస వేతన ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పోరాడుతున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు సమ్మె బాట పట్టారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంతో చర్చలు సఫలం కావడంతో ఎస్ఎస్ఎ ఉద్యోగులు సమ్మె విరమించారు. మరో వైపు మున్సిపల్ కార్మికుల సమ్మెతో పురపాలికల్లో వీధులు చెత్తమయంగా మారాయి. ప్రభుత్వంతో చర్చలు సఫలం కావడంతో మున్సిపల్ కార్మికులు సమ్మె విరమించారు.

సంక్రాంతి దోపిడీ...

పండగ సీజన్ వచ్చిందంటే ప్రయివేట్ ఆపరేటర్లు వసూళ్ల పండగ చేసుకుంటున్నారు. ఇష్టానుసారంగా బస్సు ఛార్జీలను పెంచేసి ప్రయాణికులను నిలువు దోపిడీ చేసేస్తున్నారు. రద్దీకి అనుగుణంగా ఛార్జీలను బాదేస్తున్నారు. సంక్రాంతి సెలువులు రావడంతో ప్రయివేట్ బస్సుల్లో ప్రయాణించే వారి పర్సు ఖాళీ కాక తప్పడం లేదు. పండగ సీజన్‌లో ప్రయాణికుల నుంచి ఏర్పడిన డిమాండ్‌నే ప్రయివేట్ ట్రావెల్స్ సొమ్ము చేసుకుంటున్నాయి. బస్సు రూటుతో పని లేకుండా ఛార్జీలను రెట్టింపు చేసేశారు. అదనపు ఛార్జీలు వసూలు చేయకుండా నియంత్రించాల్సిన రవాణా శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న బహిరంగ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్‌టిసిలోని సూపర్ లగ్జరీ బస్సుల్లో కర్నూలు నుంచి హైదరాబాద్‌కు రూ.350 ఉండగా అదే మార్గంలో ప్రయివేట్‌లో నాన్ ఎసి సీటర్‌లో రూ.1500 వరకూ, ఎసి సీటర్‌లో రూ.1200 నుంచి రూ.2111, నాన్ ఎసి స్లీపర్‌లో అయితే రూ.900 నుంచి రూ.2వేల వరకూ, ఎసి స్లీపర్‌లో రూ.1749 నుంచి రూ.3399 వరకూ వసూలు చేస్తున్నారు.

మట్టితింటూ నిరసన తెలుపుతున్న క్లాప్ డ్రైవర్లు

మట్టి తింటూ క్లాప్ డ్రైవర్ల నిరసన

28వ రోజు కొనసాగిన ఆందోళన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు మున్సిపల్ కార్యాలయం ఎదుట క్లాప్ డ్రైవర్లు మట్టి తింటూ నిరసన తెలిపారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర కమిటీ ఆధ్వర్యంలో సిఐటియు నగర నాయకులు దూదేకొండ కుమార్ అధ్యక్షతన 28 రోజులుగా క్లాప్ ఆటోలను బందు చేసి నిరసన తెలుపుతున్నారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్ ముందు శనివారం నిరవధిక సమ్మె చేశారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు మాట్లాడుతూ నగరంలోని చెత్త లేకుండా క్లిన్‌గా చేస్తూ నగర ప్రజల ఆరోగ్యాన్ని కాపాడు తున్న క్లాప్ డ్రైవర్లకు రెడ్డి ఏజెన్సీ, మున్సిపల్ కమిషనర్ 6 నెలల నుండి 12 నెలలుగా జీతాలు ఇవ్వకపోతే వారి కుటుంబాలను ఏ రకంగా పోషించుకుంటారనే ఇంకిత జ్ఞానం లేకపోవడం సిగ్గుచేటన్నారు. క్లాప్ డ్రైవర్ల బాధను అర్థం చేసుకొనే, అధికారులు , అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఎంపీలు లేరన్నారు. అగ్రిమెంట్ ప్రకారం జీతం, ఇఎస్ఐ, పిఎఫ్ కట్టిన బిల్లులు కమిషనర్‌కు అప్పగించిన తర్వాతనే కమిషనర్ బిల్లులు మంజూరు చేయాలన్నారు. కమిషనర్ ప్రజా సేవకుడని గుర్తుతెరిగి క్లాప్ డ్రైవర్లకు పెండింగ్ జీతాలు ఇప్పించి కర్నూలు నగరాన్ని చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉంచి ప్రజల ఆరోగ్యాన్ని కాపా డాలని డిమాండ్ చేశారు. లేకపోతే కార్పొరేషన్ కార్మికులను కలుపుకొని ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. క్లాప్ డ్రైవర్లు రఘు శేఖర్, మద్దిలేటి, కృష్ణ, పరమేష్, షేక్షావలి, రవి, శీను, దశరథ్ , కార్మికులు పాల్గొన్నారు.

జనఔషది కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- సి బెళగల్

సిబెళగల్‌లో జనఔషది కేంద్రాన్ని కెడిసిసిబి ఛైర్‌పర్సన్ విజయ మనోహరి, సింగిల్ విండో అధ్యక్షులు గోపాల్ రెడ్డి, జిల్లా సహకార అధికార గణం శనివారం ఘనంగా ప్రారంభించారు. ఇక్కడ ఆరోగ్య మందులు, ఇతర పౌష్టికాహర మందులు వంటివి లభిస్తాయని సద్వినియోగం చేసుకోవాలని విజయ మనోహరి సూచించారు. సిఇఒ పి.రామాంజనేయులు, డిజిబిలు విజయ్కుమార్, సునీల్ కుమార్, డిఎల్‌సిఒ రామాంజనేయులు, గూడూరు మేనేజర్ అయ్యస్వామి, సూపర్ వైసర్ సాయికుమార్, సిబెళగల్ సిఇఒ రవికుమార్ రెడ్డి, ఖాజా, డైరెక్టర్లు పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని తరిమి కొడదాం

' లౌకిక కవనం' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

ప్రస్తుతం దేశంలో మతోన్మాదం పురులు విప్పి సమాజంపై విషాన్ని నింపుతోందని, మతంపేరుతో చేసే మారణహోమాలు నిత్యకృత్యమయ్యాయని ఈ దేశం నుండి మతోన్మాదాన్ని తరిమి కొట్టాలని సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ అన్నారు. కర్నూలు నగరంలోని లలితకళాసమితిలో శనివారం ఉదయం సాహితీస్రవంతి విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో మతతత్వ నిరంకుశ దోరణులను నిరసిస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని, లౌకిక విలువలను ప్రతిఫలించే, ప్రభోధించే కవితా స్వరాలకు గాయకులతో ఈ నెల26 న విజయవాడ ఎంబి విజానకేంద్రంలో సాహితీస్రవంతి అధ్వర్యంలో లౌకిక కవనం నిర్వహిస్తున్నామని ప్రకటించారు. దేశంలో మతోన్మాదం పురులు విప్పి సమాజంపై విషాన్ని నింపుతోందన్నారు. అనధికార శాసనకర్తలయిన మనం ఈ దేశంలో లౌకికత్వాన్ని మతోన్మాదుల నుండి రక్షించుకోవాల్సిన అవసరం ప్రగతిశీల సాహిత్యకారులమైన మనమీద ఉందన్నారు. కవితావేశం తరాన్నే కాక యువతరాన్ని, సమాజాన్ని ఉత్తేజపరుస్తుందనే విషయం మనం మరచిపోరాదన్నారు.భారతదేశం రాజ్యాంగ పునాదుల మీద నిర్మించబడిందే తప్ప మనువాద పునాదుల మీద కాదని ఈ సమాజానికి సందేశం ఇవ్వాలన్నారు. భారతరాజ్యాంగానికి పునాదిరాళ్ళుగా ఉన్న లౌకికత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత మనమీదే ఉందని, అందుకే కవిత్వపు దృష్టికోణంలోంచి వర్తమాన సమాజాన్ని చూడాలన్నారు. అలా చూసి మనకవితాస్త్రాలు సంధించాలన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రకేంద్రం విజయవాడలో లౌకిక కవనవం లౌకికత్వాన్ని కాపాడుకునే కవితాంశాలే కవితావస్తువులన్నారు. ఈ లౌకిక కవనానికి ముఖ్య అతిథిగా సీనియర్ ఐఎఎస్ అధికారి స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎఎండి ఇంతియాజ్, అథిథులుగా ఐవిరావు ప్రముఖ కవులు ఖాదర్ మోహిద్దీన్, గుంటూరు లక్ష్మీనరసయ్య, చల్లపల్లి స్వరూపరాణి మందారపు హైమావతి ప్రసంగిస్తారన్నారు. ఈ సందర్భంగా లౌకికకవనం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. సమావేశంలో సాహితీ స్రవంతి జిల్లా నాయకులు అవుల చక్రపాణి యాదవ్, డి.అయ్యన్న, విజయులు తనగల, యూటిఎఫ్ జిల్లా కౌన్సిలర్ దొంతుల రాము తదితరులు పాల్గొన్నారు.

లౌకిక కవనం పోస్టర్ ఆవిష్కరిస్తున్న కెంగారమోహన్, ఆవుల బసప్ప , తదితరులు

జర్నలిస్టులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

జర్నలిస్టులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా, కుటుంబాలను సైతం వదిలీ సమాజం కోసం పనిచేసే జర్నలిస్టులు అందరికీ ఆదర్శప్రాయమని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. శనివారం నగరంలోని జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయం ఆవరణలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ జర్నలిస్టులకు నిత్యావసర వస్తువుల కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి జర్నలిస్టులు నిరంతరం పాటుపడుతున్నారని కొనియాడారు. సంక్రాంతి వేడుకలను జర్నలిస్టులు తమ కుటుంబాలతో సంతోషంగా కలిపి జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు మనోహర్, శ్రీనివాసులు, రామస్వామి, చెన్నయ్య, మల్లికార్జున్, ఆంజనేయులు, రామకృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి కవి సమ్మేళనం

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

కర్నూలు మద్దూర్ నగర్ పింగళి సూరన తెలుగు తోటలో శనివారం తెలుగు సారస్వత వైభవం సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి కవి సమ్మేళనం నిర్వహించారు. సభాధ్యక్షులుగా గౌరెడ్డి హరిచంద్రారెడ్డి మాట్లాడుతూ కవులు, కళాకారులు, సాంస్కృతిక రంగంలోనే కాకుండా సాంఘిక సామాజిక సంస్కరణాత్మక రంగంలో కూడా విశేషమైన ప్రభావాన్ని చూపారని అన్నారు. కవిత్వం ఒక ప్రతిభతో కూడిన విశిష్టమైన సృజన ప్రక్రియని వారు ప్రాచీన ఆధునిక కవుల సాహితీసేవను ప్రస్తావించారు. తదుపరి కవులు సంక్రాంతి పండుగ పై, వివిధ సామాజిక అంశాల మీద చక్కటి కవితా పాఠాన్ని చదివి సభను అలరించారు. ఈ సందర్భంగా దేశ రక్షణ,రైతుల సమస్యలు, వలస జీవనం, మహిళల పరిరక్షణ, యువతకు దిశా నిర్దేశం, మానవీయ విలువలు, కుటుంబ విలువలు వంటి పలు అంశాల మీద కవులు పద్యాలు , పాటలు, వచన కవిత్వంగా వినిపించారు. ముఖ్య అతిథి ఎస్‌ఎండి ఇనాయితుల్లా మాట్లాడుతూ భాషలోని చమక్కులను భాష కున్న శక్తిని, కవుల వర్ణన నిపుణతను ఉపన్యాసంలో తెలిపారన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తెలుగు భాషా సాహిత్య సేవ పురస్కారాలను జీవన సాఫల్య పురస్కారాలు అందుకున్న డాక్టర్ ఆదవాని హనుమంతప్ప, డాక్టర్ వి.పోతన్న డాక్టర్ మండి అన్వర్ హుస్సేన్‌లను తెలుగు సారస్వత వైభవం సంస్థ అధ్యక్షుడు గౌరెడ్డి హరిచంద్రరెడ్డి, కార్యదర్శి బురుజు రామకృష్ణారెడ్డి ఘనంగా సత్కరించారు. డాక్టర్ దండబోయిన పార్వతిదేవి సభను సమన్వయం చేశారు. కవులుగా ఎలవర్తి రమణయ్య, స్వరూప్‌సిన్హా, కళ్యాణదుర్గం స్వర్ణలత, మాసంబి, డాక్టర్ కరుణా చంద్రమౌళిని, సురేష్, బెల్డోన కృష్ణమూర్తి, హైమావతి, సయ్యద్ జహీర్, మునుస్వామి, రేవుల శ్రీనివాసు, గుబ్బి చిన్నస్వామి, రత్న లక్ష్మి, లక్ష్మీకాంతరెడ్డి కవులుగా సత్కారాన్ని అందుకున్నారు. ఎం. లక్ష్మయ్య, బసవరాజు, చల్ల దామోదర్ రెడ్డి, ప్రసాద్ , సూర్యచంద్రారెడ్డి, జి.రంగనాథ్ సాహిత్య అభిలాషలు పాల్గొన్నారు.

కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులకు మొమెంటోలు అందజేసిన నిర్వాహకులు

సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు, కలెక్టర్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ మంత్రులు బుగ్గనరాజేంద్రనాథ్‌రెడ్డి, గుమ్మనూరు జయరాం, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సజన శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజలంతా సుఖ సంతోషాలతో, భోగభాగ్యాలతో, సిరి సంపదలతో తులతూగుతూ ఉండాలని, భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ఆనందంగా జరుపుకోవాలన్నారు. ప్రజలంతా భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు.

నేడు బాలసాయి జన్మదిన వేడుకలు

ఉచిత వైద్య శిబిరం,సేవ ,పూజ కార్యక్రమాలు
బాలసాయి మేనేజింగ్ ట్రస్టీ రామారావు వెల్లడి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

బాలసాయి జన్మదిన వేడుకలు ప్రపంచ శాంతి సదస్సు కార్యక్రమం ఆదివారం ప్రత్యేక పూజలతో ప్రారంభం అవుతుందని బాలసాయి మేనేజింగ్ ట్రస్టీ రామారావు తెలిపారు. ప్రతి ఏడాది బాలసాయి జన్మదినాన్ని పురస్కరించుకుని బాలసాయి ఆశ్రమం శ్రీ నిలయంలో ఉదయం 7 గంటల నుండి సేవా కార్యక్రమాలు, పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం ఓమ్ని , ఆర్కా, అమ్మ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో బిపి, షుగర్, ఇసిజి, బోన్ టెస్ట్‌లు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, అందరికి ఉచిత మందులు పంపిణీ చేస్తామన్నారు. సాయంత్రం శృంగేరి శారదా పీఠం ఆస్థాన పౌరాణికులు బాచం పల్లి సంతోష్ కుమార్ శాస్త్రితో ఆధ్యాత్మిక ప్రవచనం ఉంటుందన్నారు. పేద వారికి ఉచిత కుట్టు మిషన్లు, ఇస్త్రీ పెట్టెలు, గ్రైండర్లు, తోపుడు బండ్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమాలకు జిల్లాలో ప్రజాప్రతినిధులు హాజరవుతారని, జిల్లాలోని బాలసాయి భక్తులు ప్రజలు పాల్గొనాలని కోరారు.

ప్రతి వార్డులోనూ సిమెంట్ రోడ్లు

- ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ఇచ్చిన హామీ మేరకు పట్టణంలోని ప్రతి వార్డులోనూ రోడ్లు, డ్రెయినేజీలు యుద్ధ ప్రాతపదికన ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని 6వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో వార్డు కౌన్సిలర్ సునీత అధ్యక్షతన ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి మాట్లాడారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కింద ప్రతి వార్డుకూ రూ.20 లక్షలు మంజూరవుతున్నాయని వివరించారు. నిధులతో సిమెంటు రోడ్లు, డ్రెయినేజీ ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు. 6వ వార్డులో రూ.40 లక్షలతో అన్ని రోడ్లూ బాగు చేయిస్తామన్నారు. ఓర్వలేని వారు చేస్తున్న విమర్శలను పట్టించుకోబోమని తెలిపారు. తాము చేస్తున్న అభివృద్ధి, మంచి పనులను ప్రజలు నమ్ముతున్నారని, వారి ఆశీర్వాదంతో మరోసారి ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీకి వెళ్తామని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఛైర్మన్ శాంత, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ కామాక్షి తిమ్మప్ప, వైసిపి ఇన్‌ఛార్జీ జయ మనోజ్ రెడ్డి, కాంట్రాక్టర్ రాజేంద్రప్రసాద్, అక్షరశ్రీ రామకృష్ణారెడ్డి, బికె.లక్ష్మన్న, పరిగెలా నారాయణ ఉన్నారు.

ప్రభుత్వ మొండి వైఖరి వీడాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి-ఆలూరు

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు డిమాండ్ చేశారు. శనివారం ఆలూరులో అంగన్వాడీలు చేస్తున్న 33వ రోజు సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ మాట్లాడారు. ఎమ్మెల్యేలకు రూ.లక్షల వేతనాలు, టిఎ, డిఎ, అలవెన్స్‌లు, పింఛన్లు ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర డబ్బులున్నాయని తెలిపారు. చాలీచాలని వేతనాలతో నిత్యావసర ధరలు, విద్యుత్, బస్సు, కూరగాయల ధరలు పెరిగి అప్పులతో నెట్టుకొస్తున్న అంగన్వాడీ కార్మికులకు కనీస వేతనాలు పెంచడానికి డబ్బులు లేవని చెప్పడం హాస్యాస్పదమని విమర్శించారు. పాదయాత్ర సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు కృష్ణ, షాకీర్, గోవర్ధన్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు బాలరంగమ్మ, భారతి, లక్ష్మీ, సరస్వతి, సుజాత, ప్రభావతి, పుష్పవతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

జిఒ ప్రతులను భోగి మంటల్లో దహనం చేసి నిరసన

ఆదోని : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అడిగితే భయపెట్టడం ప్రభుత్వానికి తగదని అంగన్వాడీలు ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాలు కొనసాగిస్తామని సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, పిఎస్.గోపాల్, అధ్యక్షులు రామాంజనేయులు, ఎఐటియుసి నాయకులు వీరేష్, విజయ్ హెచ్చరించారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు వరలక్ష్మి, పద్మ, శారద, అధ్యక్షతన దీక్షలు చేపట్టారు. శ్రీనివాస్ భవన్ రోడ్డులో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం జిఒ 2 ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. నోటీసులతో అంగన్వాడీలను భయభ్రాంతులకు గురి చేసినా భయపడేది లేదన్నారు. చర్చల పేరుతో కాలయాపన చేయడం సరైన పద్ధతి కాదన్నారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు కృషి చేయాలని కోరారు. లేకపోతే అంగన్వాడీలు ఎన్ని రోజులైనా సమ్మెకు సిద్ధమేనని తెలిపారు. అంగన్వాడీలు గీత, విమల, పద్మ, సోమక్క, రిజ్వాన, మీనా కుమారి, లలిత, ఉమా, లక్ష్మీదేవి, ఆంథోనమ్మ, శారద, గౌసియా, గీతా, ఈరమ్మ ఉన్నారు. **ఎమ్మిగనూరు**లో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 33వ రోజుకు చేరింది. సమ్మె శిబిరం నుంచి స్థానిక సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి, సర్కిల్‌లో కోటి సంతకాల సేకరణను జర్నలిస్టు యూనియన్ నాయకులు వి.దేవేంద్ర మూర్తి ప్రారంభించారు. అంగన్వాడీ యూనియన్ పట్టణ, మండల నాయకులు నాగలక్ష్మి, శైలజ, నీరజ, మల్లేశ్వరి, సిఐటియు డివిజన్ కార్యదర్శి బి.రాముడు, ఎఐటియుసి డివిజన్ కార్యదర్శి తిమ్మగురుడు మాట్లాడారు. అంగన్వాడీలు అరుణ, మహేశ్వరి, గాయత్రి, పుష్పవతి, లతా, శమంతకమణి పాల్గొన్నారు. **మంత్రాలయం** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 33వ రోజుకు చేరుకుంది. అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష, ఉపాధ్యక్షులు విశాలాక్షి, భీమేశ్వరి, ప్రమీల ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. అంగన్వాడీల డిమాండ్ల సాధన కోసం చేస్తున్న సమ్మెకు ప్రజలు తమ సంతకాలతో మద్దతునిచ్చి అండగా ఉన్నామని చెబుతున్నారని ఎఐటియుసి నాయకులు భాస్కర్ యాదవ్ తెలిపారు. **ఆస్పరి**లో అంగన్వాడీల సమ్మె 33వ రోజుకు చేరింది. అంగన్వాడీలు ఉరి వేసుకొని నిరసన చేపట్టారు. సిఐటియు మండల గౌరవాధ్యక్షులు బాలకృష్ణ, మండల కార్యదర్శి రామాంజినేయులు, రంగస్వామి, అంగన్వాడీ యూనియన్ నాయకులు ప్రమీల, జ్యోతి, విశ్వకుమారి, బేగం, లత పాల్గొన్నారు. **కౌతాళం**లో అంగన్వాడీల సమ్మె 33వ రోజుకు చేరుకుంది. అంగన్వాడీలకు జీతాలు పెంచి వారి కుటుంబాలను ఆదుకోవాలని ప్రాజెక్టు ఉపాధ్యక్షులు విజయలక్ష్మి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య డిమాండ్ చేశారు.

ఆలూరులో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ఆదోనిలో జిఒ ప్రతులను దహనం చేస్తున్న అంగన్వాడీలు

ఆస్పరిలో ఉరి వేసుకుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

నిందితుని కఠినంగా శిక్షించాలి

- సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్

ప్రజాశక్తి- దేవనకొండ

మాట్లాడుతున్న వీరశేఖర్

మండలంలోని పి.కోటకొండ గ్రామంలో ఏడేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుని కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్, మండల కమిటీ సభ్యులు అశోక్, మహబూబ్ బాషా, యూసుఫ్ డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అత్యాచార ఘటనలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నిందితులకు శిక్ష పడడంలో జాప్యం, రాజకీయ జోక్యం వల్ల బాలికలు, మహిళలపై అత్యాచారాలు అధికమవుతున్నాయని తెలిపారు. బాలికలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు అడ్డుకట్ట వేయాలంటే నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. విచారణ పేరుతో జాప్యం చేయకుండా ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా నిందితునికి త్వరగా శిక్షపడే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్వచ్ఛభారత్‌లో సాధించిన ర్యాంకుపై హర్షం

ప్రజాశక్తి - ఆదోని

స్వచ్ఛ భారత్ సర్వేక్షన్-2023 కార్యక్రమంలో భాగంగా రాష్ట్రస్థాయిలో 124 పురపాలక సంఘాలు పాల్గొనగా ఆదోని పురపాలక సంఘానికి 15వ ర్యాంకు వచ్చిందని ఆదోని మున్సిపల్ కమిషనర్ రఘురామిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడారు. జాతీయ స్థాయిలో 247వ ర్యాంకు, ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండో స్థానం సాధించిందన్నారు. ఒడిఎఫ్ఎం సర్టిఫికెట్ పొందామని తెలిపారు. ఘనత సాధించడానికి సహకరించిన ఆదోని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత, వైస్ ఛైర్మన్లు నరసింహులు, మహ్మద్ గౌస్, వార్డు కౌన్సిలర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలకు, పారిశుధ్య కార్మికులకు అభినందనలు తెలిపారు.

ఘనంగా శ్రీసుయతీంద్ర తీర్థుల ఆరాధన

మంత్రాలయం : ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్ర స్వామి మఠం పూర్వపు పీఠాధిపతులు శ్రీసుయమీంద్ర తీర్థుల ఆరాధనను పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం శ్రీసుయమీంద్ర తీర్థుల ఆరాధన సందర్భంగా ఆయన బృందావనాన్ని నిర్మాల్యం చేసి పంచామృతాభిషేకం, తులసి అర్చనతో మంగళ హారతులు ఇచ్చారు. అంతకుముందు రాఘవేంద్రుని ఆరాధ్య దైవమైన మూలరాములకు విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం రాఘవేంద్రుని బృందావనాన్ని దర్శించుకుని నైవేద్య సమర్పణతో మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం శ్రీసుయమీంద్ర తీర్థుల బృందావనాన్ని దర్శించుకుని నైవేద్య సమర్పణ చేశారు. శ్రీసుయమీంద్ర తీర్థుల బృందావనాన్ని పుష్ప హారాలతో అందంగా అలంకరించారు.

నెరణికి, నెరణికి తండాలో 'వికసిత్ భారత్'

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని నెరణికి, నెరణికి తండాల్లో బిజెపి మండల అధ్యక్షులు ఎఇఎన్.ప్రసాద్, ఆధ్వర్యంలో శనివారం 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' నిర్వహించారు. అసెంబ్లీ కన్వీనర్ డిఎం.వెంకటరాముడు, నేషనల్ కౌన్సిల్ మెంబర్ చిదానంద, మండల సెక్రటరీ విజయ్, మండల యువ మోర్చా వైస్ ప్రెసిడెంట్ సుధాకర్, యువ మోర్చా ప్రధాన కార్యదర్శి చిన్న, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి రామలింగ, నెరణికి తండాలో మండల ఎస్టీ మోర్చా అధ్యక్షులు రాజేష్ నాయక్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఆదోని

క్రిస్టియన్ రిఫార్మ్‌డ్ చర్చ్ ఆధ్వర్యంలో ఆదోనిలోని అరుణ్ జ్యోతి వీధి వాసులకు ఉచిత వైద్య శిబిరం శనివారం ఏర్పాటు చేశారు. 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, ఉచిత మందులు ఇచ్చామని నిర్వాహకులు, పాస్టర్ జాషువా జోసెఫ్ తెలిపారు. వైద్యులు డాక్టర్ రంజిత్ కుమార్, డాక్టర్ చైతన్య కాల్విన్, డాక్టర్ సలోమి దేవ కుమారి రోగులకు పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత సమస్య ఉన్నవారికి ఉచిత మందులు, తగిన సూచనలు ఇచ్చారు.

వైష్ణవి అకాడమీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

బహుమతులు అందిస్తున్న సిబ్బంది

పట్టణంలోని వైష్ణవి అకాడమీ (విద్యాసంస్థల) ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా 'రావమ్మ మహాలక్ష్మి' పేరుతో ముగ్గుల పోటీలు నిర్వహించారు. శనివారం ముగ్గుల పోటీల్లో ప్రతిభ చాటిన పట్టణ మహిళలకు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కుర్ని కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ బుట్టా శారద, ఉపాధ్యాయులు కవిత, నాగమణి, సుజాత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కళాశాల కరస్పాండెంట్ సత్య సిరి, కో కరస్పాండెంట్ కనకనిధి పోటీల్లో విజేతలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సంప్రదాయాలను మరువకుండా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. నేటి తరానికి ఇవి ఎంతో ఉపయోగపడతాయన్నారు.

విరుపాక్షిని వరించిన వైసిపి టిక్కెట్...

- అంచెలంచెలుగా ఎదిగిన రాజకీయ ప్రస్థానం... - గ్రామాల్లో కార్యకర్తల సంబరాలు..

ప్రజాశక్తి-ఆలూరు

చిప్పగిరి జడ్‌పిటిసి విరుపాక్షికి ఆలూరు వైసిపి టిక్కెట్ ఇస్తున్నట్లు అధిష్టానం ప్రకటించడంతో వైసిపి ఆలూరు అసెంబ్లీ సీటుపై 15 రోజులుగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ఆలూరు అసెంబ్లీ టిక్కెట్ విషయంలో మంత్రి జయరామ్, హిమవర్షరెడ్డి, కప్పట్రాళ్ల బొజ్జమ్మ, చిప్పగిరి జడ్‌పిటిసి విరుపాక్షి మధ్య అధిష్టానం వద్ద జోరుగా చర్చ జరిగినట్లు తెలిసింది. విరుపాక్షికి సీటు (ఆలూరు వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ) కేటాయిస్తూ అధికారికంగా ప్రకటన వెలువడడంతో నియోజకవర్గంలో విరుపాక్షి గ్రూపు సంబరాలు చేసుకుంది.

విరుపాక్షి రాజకీయ ప్రస్థానం

అంచెలంచెలుగా ఎదుగుతూ ఎమ్మెల్యే బరిలో నిలిచేవరకు కొనసాగింది. 1969వ సంవత్సరం మార్చి నెల 4న శ్రీదేవమ్మ, చిన్న ఆంజనేయులుకు విరుపాక్షి జన్మించారు. ఇంటి పెద్ద కుమారునిగా రైల్వే కాంట్రాక్టు పనులు చేసుకుంటూ రాజకీయాలపై ఉన్న ఆసక్తితో కాంగ్రెస్‌లో చురుకుగా పాల్గొనేవారు. జిల్లాలో అనేక మంది రాజకీయ నాయకులతో సన్నిహిత సంబంధాలున్నాయి. కీర్తిశేషులు వైఎస్.రాజశేఖర్ రెడ్డి మరణానంతరం ఆయన తనయుడు వైఎస్.జగన్మోహన్ రెడ్డి పార్టీలో చేరారు. మంత్రి గుమ్మనూరు జయరామ్‌కు సన్నిహితుడుగా వైసిపి పార్టీలో పని చేశారు. 2019 ఎన్నికల్లో మంత్రి గెలుపునకు తనవంతు తోడ్పాటునందించారు. మంత్రి కూడా విరుపాక్షికి ఉన్న ప్రజాదరణ చూసి జడ్‌పిటిసి టిక్కెట్ కేటాయించారు. ఆ ఎన్నికల్లో జడ్‌పిటిసిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గెలిచిన కొన్నిరోజులకే మంత్రి సోదరులకు, విరుపాక్షికి మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. విరుపాక్షి కూడా మంత్రికి దూరంగా ఉంటూ సొంతగా పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించేవారు. నియోజకవర్గంలో శుభకార్యాలకు, ఆపదలకు, గ్రామాల అభివృద్ధికి ఎవరు పిలిచినా, తెలిసినా హాజరై ఆప్యాయంగా పలుకరిస్తూ, కోరిన వారికి కాదనకుండా తనవంతు ఆర్థిక సహాయ, సహకారాలు అందించడంతో ప్రజాదరణ పొందారు. ప్రజాదరణే ఎమ్మెల్యే టిక్కెట్ రావడానికి దోహద పడిందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ, ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్ వింగ్ అధ్యక్షులు, చిప్పగిరి జడ్‌పిటిసి బి.విరుపాక్షి ప్రొఫైల్

పూర్తి పేరు: బుసినే విరుపాక్షి
తల్లి : శ్రీదేవమ్మ
తండ్రి : చిన్న ఆంజనేయులు
భార్య : రామాంజినమ్మ
కొడుకులు: లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్
చదువు : 10వ తరగతి
పుట్టినతేది: 04-03-1969

ముఖ్యమంత్రి జగన్ ఆర్థిక నేరస్తుడు

- టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆర్థిక నేరస్తుడని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి విమర్శించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు జగన్మోహన్ రెడ్డి తీరును, పెత్తందారి పోకడలను వైసిపి ఎమ్మెల్యేలు, ఎంపీలే బహిరంగంగా చెబుతున్నారని తెలిపారు. జగన్ జేబు సంస్థ సిఐడిని అడ్డం పెట్టుకుని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుపై కక్ష సాధింపు చర్యలతో పాటు నీలి మీడియాలో అసత్యాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ రెడ్డిపై ఇప్పటికే 38 కేసులు ఉన్నాయని, రూ.43 వేల కోట్ల దోపిడిపై సిబిఐ, ఈడీ ఛార్జిషీట్లు కూడా వేసిందని తెలిపారు. ఈ కేసుల్లో ఇప్పటికి 3,500 సార్లు వాయిదా తీసుకున్న ఏకైక ఆర్థిక నేరస్తుడు జగన్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. 2004లో అప్పుల వల్ల హైదరాబాద్‌లో ఉన్న ఇల్లు అమ్ముకునే స్థితిలో ఉన్న జగన్ రెడ్డి 19 ఏళ్లలో రూ.4 లక్షల కోట్లు ప్రజా సంపదను కొల్లగొట్టారని తెలిపారు. జగన్ పాలనలో చంద్రబాబుపై 13 అక్రమ కేసులు పెట్టి ఏ కేసుకూ ఆధారాలు చూపలేదన్నారు. జగన్ రెడ్డి కేసులపై సాక్షాత్తు జడ్జీలే కీలక వ్యాఖ్యలు చేసిన సందర్భాలు అనేకమని తెలిపారు. ఎన్ని ఇబ్బందులకు గురి చేసి, అక్రమంగా కేసులు పెట్టినా టిడిపి భయపడదని, రానున్న రోజుల్లో జగన్ రెడ్డి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్రజలు జగన్ రెడ్డి అక్రమాలను, అన్యాయాలను, అవినీతి పాలనను గమనిస్తూనే ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని తెలిపారు.

మాట్లాడుతున్న బీవీ.జయ నాగేశ్వర రెడ్డి

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి - కోసిగి

ఆర్థిక సాయం అందజేస్తున్న వైసిపి నాయకులు

ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసిపి మండల ఇన్‌ఛార్జీ మురళీ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మండల నాయకులు, అగసనూరు సర్పంచి ఉలిగయ్య, మాజీ సర్పంచి ఆకాష్ రెడ్డి ఆధర్వంలో వైఎస్ఆర్ బీమా కింద రూ.10 వేల ఆర్థిక సహాయం శనివారం అందజేశారు. గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో దాసరి సురేష్ మృతి చెందారు. వైఎస్ఆర్ బీమా కింద రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని గీతకు అందజేశారు. అనంతరం మాజీ సర్పంచి ఆకాష్ రెడ్డి మాట్లాడారు. వైఎస్ఆర్ బీమా కింద నగదు అందజేశామని, మిగిలిన మొత్తం నామిని ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. నాయకులు గోర్లి శివయ్య, చిన్నముతి ఉలిగయ్య, హనుమప్ప, నర్సయ్య, భీమన్న, నాగేంద్ర, యువ నాయకులు బాబు రెడ్డి, బసన్న, నాగరాజు, సతీష్ పాల్గొన్నారు.

సిఐ శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండ పోలీసు స్టేషన్ అప్‌గ్రేడ్ కావడంతో సిఐగా శ్రీనివాసులు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా పని చేస్తానని తెలిపారు. గ్రామాల్లో ప్రజలు ప్రశాంత జీవనం కొనసాగించాలని, అల్లర్లు, ఘర్షణలు, అసాంఘిక కార్యకలాపాలు ప్రోత్సహించే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

సిఐ ఎరిషా వలీ బాధ్యతల స్వీకరణ

మంత్రాలయం : మంత్రాలయం సిఐగా ఎరిషావలీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు మంత్రాలయం సిఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీనివాసులు దేవనకొండకు బదిలీ అయ్యారు. విఆర్‌లో ఉన్న ఎరిషావలీకి మంత్రాలయం సిఐగా పోస్టింగు ఇచ్చారు. అందులో భాగంగానే సిఐగా ఎరిషా వలీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ వేణుగోపాల్ రాజు పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సిఐ ఎరిషావలీ మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్న వారిపైనా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సిఐకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఐ

కార్యకర్తలకు అండగా ఉంటాం

- వైసిపి మండల ఇన్‌ఛార్జీ మురళీ మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - కోసిగి

కార్యకర్తలకు అండగా రాంపురం రెడ్డి సోదరులు ఎల్లప్పుడూ నిలుస్తారని వైసిపి మండల ఇన్‌ఛార్జీ పి.మురళీ మోహన్ రెడ్డి తెలిపారు. కోసిగి వైసిపి నాయకులు గానుగ వీరాస్వామి తండ్రి గానుగ తిప్పయ్య (80), అలాగే జుమ్మాలదిన్నె వైసిపి కార్యకర్త ఈడిగ జయరామ్ (48) అనారోగ్యంతో బాధ పడుతూ మృతి చెందారు. శనివారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మురళీ మోహన్ రెడ్డి కోసిగిలో గానుగ తిప్పయ్య, జుమ్మలదిన్నెలో ఈడిగ జయరామ్ మృతదేహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి, అండగా ఉంటామని తెలిపారు. జగదీష్ స్వామి, కొరివి నాగరాజు, బుడగ జంగాల అయ్యప్ప, అంజి, ప్రవీణ్ కుమార్, గ్యాంగ్ ఈరన్న, పాండుస్వామి, తిమ్మారెడ్డి, నీలకంఠ, నాగమ్మ, సిద్ధరామ, రామయ్య, కృష్ణయ్య ఉన్నారు.

మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మురళీమోహన్ రెడ్డి

ఆల్ ఫ్రెడ్ రాజు సేవలు కులమతాలకు అతీతం

- ఆల్ ఫ్రెడ్ రాజు సేవలను మంత్రాలయం ప్రజలు ఎన్నటికీ మర్చిపోరు
- శ్రీమఠం పీఠాధిపతి శ్రీసుభుదేంద్ర తీర్థుల ఆశీస్సులు అందుకున్న ఆల్ ఫ్రెడ్ రాజు

ప్రజాశక్తి - మంత్రాలయం

ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ (ఎఐసిసి) రాష్ట్ర కార్యదర్శి, మల్లెల గ్రూప్స్ అధినేత, డాక్టర్ మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు మతసామరస్యాన్ని కాపాడుతూ, కులమతాలకు అతీతంగా అందిస్తున్న సేవలు అభినందనీయమని, ఆయన సేవలను మంత్రాలయం ప్రజలకు ఎంతో అవసరమని శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థులు పేర్కొన్నారు. శనివారం రాఘవేంద్రస్వామి మఠంలో డాక్టర్ మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు మైసూర్‌కు చెందిన శ్రీనివాస కల్యాణ సేవా సమితి, సప్తర్షి సౌహర్ద పట్టిన కోఆపరేటివ్ సొసైటీ వారి ఆధ్వర్యంలో పీఠాధిపతుల చేతుల మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు డాక్టర్ మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజుకు శేష వస్త్రం, పూలమాల వేసి మెమెంటో అందజేసి ఆశీస్సులు అందజేశారు. ఆల్ ఫ్రెడ్ రాజు క్రైస్తవుడు అయినప్పటికీ బ్రాహ్మణుడైన తన మిత్రుడని గురురాజతో స్నేహం కలిగి ఉండడంతో బ్రాహ్మణుల్లో మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో విప్రభాండ్ పేరుతో వెంచర్ వేసి బ్రాహ్మణులకు సులభతరంగా సరసమైన ధరలకు ప్లాట్లు ఇచ్చారని తెలిపారు. 2009లో వరదలు సంభవించి మంత్రాలయం నీట మునిగి అతలాకుతలమైనప్పుడు ఆల్ ఫ్రెడ్ రాజు వద్ద ఉండి వరద బాధితులకు అందించిన సహాయాన్ని మంత్రాలయం ప్రజలు ఎన్నటికీ మరిచిపోరని గుర్తు చేశారు. మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు కుల మతాలకు అతీతంగా సేవలను మరింతగా విస్తరింపజేయాలని తెలిపారు. మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజ్ మిత్రబృందం గురు రాజ్, ఎంఎస్.బసవన్న, సుబ్బన్న, రంగా రావు, బిఆర్.నగేష్, రాధాకృష్ణ, పి.మహా దేవప్ప పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పీఠాధిపతులు

ఆస్పరిలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - ఆస్పరి

సంక్రాంతి పండగ సందర్భంగా ఆస్పరిలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆస్పరి సేవా సమితి కమిటీ సభ్యులు రామకృష్ణ, మహేష్, నరసింహులు, అరవింద్ తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. కబడ్డీ పోటీల్లో పాల్గొనే జట్లు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి జట్ల పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. గెలిచిన జట్లకు మొదటి బహుమతి రూ.20,116, రెండో బహుమతి రూ.10,116, మూడో బహుమతి రూ.5,116 అందజేయనున్నట్లు తెలిపారు. పేర్లు నమోదు చేసుకోవడానికి చివరి తేదీ ఈనెల 14 అని చెప్పారు. ఇతర వివరాలకు 9966419020, 9912951780, 9059089535 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు. ఆర్గనైజర్లు నరసప్ప, విజయ్, హేమంత్, వీరేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మండల సమితి సభ్యులు రామకృష్ణ

విరుపాక్షికి ఎమ్మెల్యే టిక్కెట్ పట్ల హర్షం

ప్రజాశక్తి - దేవనకొండ

చిప్పగిరి జడ్‌పిటిసి విరుపాక్షికి వైసిపి ఆలూరు ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించడం పట్ల ఎంపిటిసి తపాలా శ్రీనివాసులు నాయుడు, వైసిపి నాయకులు పొట్లపాడు కేశన్న, వెలమకూరు జయన్న హర్షం వ్యక్తం చేశారు. శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైసిపి నుంచి టిక్కెట్ ఎవరికి కేటాయించినా తమ మద్దతు ఉంటుందని తెలిపారు. సంక్షేమ పథకాలతో పేదలను అభివృద్ధి చేసిన వైసిపిని మరోసారి గెలిపించుకోవాలని కోరారు. వైసిపి నాయకులు సుదర్శన్ రెడ్డి, జనార్ధన్ నాయుడు, హనుమంతు, రంగన్న, సోమన్న పాల్గొన్నారు.

బానిస సంకెళ్లు తెంచి.. రాజ్యాధికారానికి సన్నద్ధం

- మత్స్యకార సహకారం సంఘం నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

బానిసత్వ సంకెళ్లు తెంచేసి రాజ్యాధికారం కోసం సన్నద్ధం కావాలని మత్స్యకార సహకార సంఘం ఉమ్మడి జిల్లాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు గూడూరు శ్రీనివాసులు, చిన్నతుంబళం వీరేష్‌లు సంప్రదాయ మత్స్యకారులను కోరారు. శనివారం ఆదోనిలోని మంగళ ఆంజనేయస్వామి దేవాలయంలోని కల్యాణ మండలంలో కత్తి హనుమంతరావు, పగడాల కోదండ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అంతకుముందు సహకార కుల సంఘాల ఎన్నికల్లో గెలుపొందిన వారిని ఘనంగా సన్మానించారు. ఆదోని డివిజన్‌లో బెస్తలకు టిక్కెట్లు కేటాయించిన వారిని కుల బాంధవులందరూ కలిసి ప్రచారం చేసి గెలిపించుకోవాలని తీర్మానించారు. టిక్కెట్లు కేటాయించకపోతే జిల్లావ్యాప్తంగా ఉన్న అసెంబ్లీ స్థానాలకు ఇండిపెండెంట్‌గా పోటీకి సన్నద్ధం కావాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న దస్తగిరి నాయుడు

అత్యాచార నిందితుని శిక్షించాలి : టిడిపి

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని పి.కోటకొండ గ్రామంలో ఏడేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన బోయ ముని రంగడును కఠినంగా శిక్షించాలని టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, టిడిపి నాయకులు బడిగింజల రంగన్న, ఉచ్చీరప్ప, మాలిక్ డిమాండ్ చేశారు. శనివారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇలాంటి ఘటనలతో మానవత్వం మంటకలిసుపోతోందని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. టిడిపి నాయకులు డీలర్ బండ్లయ్య, మస్తాన్, మాజీ ఎంపిటిసి వెంకటేష్, రాజశేఖర్ గౌడ్, రాజగోపాల్ గౌడ్ పాల్గొన్నారు.

సమావేశంలో విజయ భాస్కర్ గౌడ్

IN THE COURT OF II ADDL. DISTRICT JUDGE, KURNOOL AT : ADONI
APPEAL SUIT No 51/2023
Between:
K. Budha Reddy ....Appellant
Versus
1. K. Mahanandi
2. R.M. Krishnanda Reddy
3. RM Gurunath Reddy ...Respondents
To,
1. R.M. Krishnananda Reddy S/o R.M. Chenna Reddy,
2. R.M. Gurunath Reddy, S/o R.M. Chenna Reddy, C/o: R.M. Somasekhar Reddy Both are resient of House Diner 6/76, Reddigari Street, kowthalam Village.

SUMMONS TO RESPONDENTS-2 AND 3

Sirs,
Please take notice that the above Appeal is filed assailing the orders dt: 02-08-2023 in EP. 8/2017 in OS no: 243 of 2015 on the file of Principal Junior civil judge court at Adoni. The Appellant also filed an application to stay entire proceedings in EP. 8 of 2017 in OS no: 243 of 2015 including delivery of property to Responent no : 1 pending disposal of the Appeal. You are hereby call upon you to appear before this Honorable court on 13.2.2024 at 10.30. a.m., either in person or through your counsel and file your objections if any, failing which the matter will be heard in your absence and you will be set ex-parte.
By order of this court
P. MADHUSUDHAN REDDY
AVOCATE FOR APPELLANT
ADONI.

ప్రజాశక్తి
ఆదివారం 14 జనవరి 2024
5
నంద్యాల

బెదిరిస్తే మూల్యం తప్పదు..

- జీతాలు పెంచకుంటే ఆందోళన ఉధృతం - సిఐటియు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు
- గుమ్మడికాయలు పగలకొట్టి, మట్టి తింటూ, ఉరితాళ్లు, చెవిలో పూలు పెట్టుకుని, మోకాళ్లపై నిలబడి నిరసన
- 33వ రోజూ అంగన్వాడీల నిరవధిక సమ్మె

నంద్యాలలో గుమ్మడి కాయలు పగలకొడుతూ అంగన్‌వాడీల నిరసన

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడితే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని సిఐటియు, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీల సమ్మె 33వ రోజు శనివారం కొనసాగింది. నంద్యాల జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీలు గుమ్మడికాయలు పగలకొట్టి నిరసన చేపట్టారు. ఆత్మకూరులో మట్టి తింటూ, పగిడ్యాలలో ఉరితాళ్లతో, నందికొట్కూరులో చెవిలో పూలు పెట్టుకుని, బండి ఆత్మకూరులో కళ్లకు గంతలు కట్టుకుని, మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేశారు. బేతంచెర్లలో అంగన్‌వాడీల సమ్మెకు జనసేన పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు.

(వార్త 6వ పేజీలో...)

ఆందోళన బాట...

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

జిల్లా వ్యాప్తంగా పలు రంగాలకు చెందిన ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. గత కొన్ని రోజులుగా నిరవధిక సమ్మెలను కొనసాగించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలనిఎ రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలని, వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని, గ్రాట్యుటి ఇవ్వాలని, గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు పౌష్టిక ఆహారం ఇవ్వడం కొరకు అదనపు నిధులు కేటాయించాలని అంగన్వాడీలు నిరవధిక సమ్మె చేపడుతున్నారు. వంటావార్పు, ఒంటి కాలిపై నిలబడి, మెడకు ఉరితాళ్లు బిగించుకున్నట్లు నిరసన వ్యక్తం చేస్తున్నారు. మానవహారాలు, పొర్లుదండాలు, మోకాళ్లపై నిలబడి వివిధ రూపాల్లో నిరసన తెలియజేశారు. ఎంపి, ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడించారు. విగ్రహాలకు, దున్నపోతులకు వినతి పత్రాలు సమర్పించారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు. అంగన్వాడీలకు టిడిపి, సిపిఎం, సిపిఐ, జనసేన పార్టీలు, కార్మిక, రైతు, ప్రజా సంఘాలు, ఎపిడబ్ల్యూజెఎఫ్ మద్దతు తెలిపాయి. న్యాయమైన కోరికలను సాధించుకునేంత వరకూ పోరాటం సాగించాలని, అండగా తాముంటామని భరోసానిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎస్ఎలో పని చేస్తున్న ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టారు. ఎంటిఎస్ ఇచ్చిన మూడు జిఒలను అమలు చేయాలని, 62 సంవత్సరాలు సర్వీసు కొనసాగించాలని, మెటర్నిటీ లీవులతో కూడిన వేతనాలు, రూ.26 వేల కనీస వేతన ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పోరాడుతున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు సమ్మె బాట పట్టారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేసారు. ప్రభుత్వంతో చర్చలు సఫలం కావడంతో ఎస్ఎస్ఏ ఉద్యోగులు సమ్మె విరమించారు. మరో వైపు మున్సిపల్ కార్మికుల సమ్మెతో పురపాలికల్లో వీధులు చెత్తమయంగా మారాయి. ప్రభుత్వంతో చర్చలు సఫలం కావడంతో మున్సిపల్ కార్మికులు సమ్మె విరమించారు.

సంక్రాంతి దోపిడీ...

పండుగ సీజన్ వచ్చిందంటే ప్రయివేటు ఆపరేటర్లు వసూళ్ల పండగ చేసుకుంటున్నారు. ఇష్టానుసారంగా బస్సు ఛార్జీలను పెంచేసి ప్రయాణికులను నిలువు దోపిడీ చేసేస్తున్నారు. రద్దీకి అనుగుణంగా ఛార్జీలను బాదేస్తున్నారు. సంక్రాంతి సెలవులు రావడంతో ప్రయివేటు బస్సుల్లో ప్రయాణికులకు పర్సు ఖాళీ కాక తప్పడం లేదు. పండుగ సీజన్లో ప్రయాణికుల నుంచి ఏర్పడిన డిమాండ్‌నే ప్రయివేటు ట్రావెల్స్ సొమ్ము చేసుకుంటున్నాయి. బస్సు రూటుతో పని లేకుండా చార్జీలను రెట్టింపు చేసేసారు. అదనపు ఛార్జీలు వసూలు చేయకుండా ఛార్జీలను నియంత్రించాల్సిన రవాణా శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న బహిరంగ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టీసిలోని సూపర్ లగ్జరీ బస్సుల్లో కర్నూలు నుంచి హైదరాబాద్‌కు రూ.350 ఉండగా అదే మార్గంలో ప్రయివేటులో నాన్ ఏసి సీటర్లో రూ.1500 వరకూ, ఏసి సీటర్లో రూ.1200 నుంచి రూ.2111, నాన్ ఏసి స్లీపర్ అయితే రూ.900 నుంచి రూ.2 వేల వరకూ, ఏసి స్లీపర్ రూ.1749 నుంచి రూ.3399 వరకూ వసూలు చేస్తున్నారు.

నకిలీ ఆర్‌టిఏ అధికారులు అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండలంలోని చింతకుంట సమీపంలో ఆర్‌టిఏ శాఖ అధికారులమని చెప్పి వాహన తనిఖీలు చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్న నకిలీ ముఠాను శనివారం పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం స్థానిక టౌన్ పోలీస్ స్టేషన్లో డిఎస్‌పి వెంకటరామయ్య మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన చెందిన విల్సన్ కుమార్, దూదేకుల ఉసేనయ్య, చిన్న వెంకటేశ్వర్లు ముఠాగా ఏర్పడి రాత్రి సమయాల్లో వాహనాలను ఆపి ఆర్‌టిఏ అధికారులమంటూ బెదిరించే వారన్నారు. పెద్ద చింతకుంట శివారులోని కాశీనాయన ఆశ్రమం వద్ద వాహనాలను ఆపి డ్రైవర్లను బెదిరిస్తుండగా పట్టణ ఎస్ఐ వెంకటరెడ్డి సమాచారం అందుకొని సిబ్బందితో దాడి చేసి ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. వారి నుండి కారును, రెండు సెల్ ఫోన్‌లను, రూ. 2200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చెడు వ్యసనాలకు బానిసలై డబ్బు కోసం మోసం చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన హెడ్ కానిస్టేబుల్ హుస్సేని, కానిస్టేబుల్ ఉదయ్ మునీశ్వర్, హోంగార్డులు ప్రసాద్, ఓబులేసు, రుద్రుడులను డిఎస్‌పి అభినందించారు. సమావేశంలో టౌన్ సిఐ రమేష్ బాబు, ఎస్ఐ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

భృంగి వాహనంపై స్వామి అమ్మవార్లు

భృంగి వాహనంపై స్వామి అమ్మవార్లు

ప్రజాశక్తి - శ్రీశైలం

మకర సంక్రమణాన్ని పురస్కరించుకొని శ్రీశైల క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు శనివారం సాయంకాలం స్వామి అమ్మవార్లు భృంగి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి అమ్మ వార్లకు ఉదయం చండీశ్వర పూజ, లోక కళ్యాణం కోసం చతుర్విధ పారాయణలు, జపాలు, రుద్ర పారాయణలు, మండపారాధనలు, పంచవరార్చణలు, రుద్రహోమం తదితర విశేష పూజలు ఆగమ శాస్త్రానుసారం నిర్వహించారు. సాయంకాలం ప్రదోషకాల పూజలు, హోమాలు చేశారు. ఆ తర్వాత అక్క మహాదేవి అలంకార మండపంలో భృంగి వాహనంపై స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత వివిధ కళారూపాలు, విద్యుద్దీపాలు, వేదమంత్రాల మధ్య ఆలయ రాజగోపురం గుండా ప్రధాన వీధుల్లోకి గంగాధర మండపం వద్ద నుండి బయలుదేరారు. ప్రధాన వీధులలో నంది గుడి వరకు అక్కడి నుండి తిరిగి బయలు వీరభద్ర స్వామి మీదుగా ఆలయంలోకి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. గ్రామోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కార్మిక, కర్షకులకు అండగా ఎర్రజెండా

- సిఐటియు, వ్యకాసం, రైతు సంఘం నేతలు
- జూపాడుబంగ్లాలో కార్మిక కర్షక భవనం ప్రారంభం

రిబ్బన్ కట్ చేస్తున్న నాయకులు ఎ.రాజశేఖర్

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

కార్మికులకు, కర్షకులకు అండగా ఎర్రజెండా నిలుస్తుందని సిఐటియు, వ్యకాసం, రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. శనివారం జూపాడుబంగ్లా మండల కేంద్రంలోని క్వాటర్స్‌లో కార్మిక కర్షక భవనం ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా అధ్యక్షులు యేసురత్నం హాజరై సిఐటియు జెండా ఆవిష్కరించారు. అనంతరం రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రాజశేఖర్ రిబ్బన్ కట్ చేసి కార్మిక కర్షక భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు రాము అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.నాగేశ్వరరావు మాట్లాడారు. జూపాడు బంగ్లా మండలంలో కార్మిక కర్షక భవనం ప్రారంభించడం ఎంతో గర్వకారణమైన విషయమన్నారు. మండలంలో కార్మిక కర్షకులు, రైతు వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోసం మండల సెంటర్లో మండల నాయకులు అందుబాటులో ఉంటూ పని చేయాలని కోరారు. పాలక ప్రభుత్వాలు తమ స్వార్థ రాజకీయాలకు ఎన్నికల ముందు ప్రజలకు మోసపూరిత హామీలిచ్చి అధికారం దక్కిన అనంతరం హామీలు అమలు చేయకుండా రైతు, వ్యవసాయ కూలీలు, కార్మిక కర్షకులపై ఉక్కు పాదం మోపుతున్నాయని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై మండిపడ్డారు. ఇప్పటికే అంగన్వాడీ వర్కర్స్ 33 రోజుల నుంచి రోడ్లపై ఆందోళన చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం కనికరం లేకుండా వారిపై ఎస్మా చట్టాన్ని, నిర్బంధాన్ని కొనసాగించడం దారుణమన్నారు. ఆరుసార్లు చర్చలు జరిపినా పరిష్కారం దిశగా కృషి చేయకుండా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. రైతు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, కర్షకులు తమ హక్కుల కోసం ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, సామన్న, వ్యకాసం మండల కార్యదర్శి కర్ణ, నాగన్న, సిఐటియు నాయకులు నరసింహ, ఆంజనేయులు, రైతు సంఘం మండల కార్యదర్శి ఏసన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డక్క కుమార్, కెవిపిఎస్ జిల్లా నాయకురాలు కే రంగమ్మ, జయరాని, నవశాని, అంగన్వాడీ వర్కర్స్ నాయకురాలు వెంకట రమణమ్మ, జయమ్మ, డప్పు కళాకారులు, కార్మిక కర్షకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు ఎం.నాగేశ్వరరావు, వేదికపై సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం తదితరులు

లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే

జగనన్నతోనే సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పాదయాత్ర సందర్భంగా జగనన్న ఇచ్చిన హామీలను ప్రతి ఒక్కటీ అమలు చేశారని, సంక్షేమ పథకాలు మళ్ళీ కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తుడుమలదిన్నె, గోవిందపల్లె గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు తెలుగుదేశం నాయకులు బూటకపు హామీలతో ప్రజల ముందుకు వస్తున్నారని, మళ్ళీ వారిని నమ్మితే మోసం చేస్తారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పిటిసికసాని పుణ్య లక్ష్మిదేవి, సర్పంచులు చామల ఉమాదేవి, వైసిపి మండల అధ్యక్షులు బుడ్డా చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెండి హారతి పళ్లెం విరాళం

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మండలం కొండమాయపల్లి పంచాయతీ గ్రామ పొలిమేరలో వెలిసిన వాసాపురం వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం సందర్భంగా స్వామివార్లకు విశేష పూజలు జరిగాయి. ఆలయానికి జిల్లెల్ల గ్రామ వాసులు ఇందూరి సునీల్ కుమార్ రెడ్డి, సునీత దంపతులు 850 గ్రాముల వెండి హారతి పళ్లెం విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షులు సింగతల మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యక్షులు లింగం వెంకట రంగనాయకులు శెట్టి, కోశాధికారి ఈడిగ కాణాల నరసింహులు, కార్యవర్గ సభ్యులు రఘునాథరెడ్డి, జనార్దన్ రెడ్డి, కేశవరెడ్డి, సూర్య నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కార్యవర్గ సభ్యులకు వెండి పళ్లెం అందజేస్తున్న దాతలు

వైద్య సేవలకు సిఎం పెద్దపీట

- త్వరలో నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు చర్యలు
- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి
- జిల్లా ప్రభుత్వాస్పత్రిలో అభివద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో వైద్య సేవలను మరింతగా విస్తరింపజేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి అన్నారు. నంద్యాల జిల్లా ప్రభుత్వ సర్వజన హాస్పటల్‌లో రూ. 5 కోట్ల 11 లక్షల వ్యయంతో నిర్మించిన బాలల సత్వర చికిత్స కేంద్రం, మెడికల్ కళాశాలలో లెక్చరర్ హాల్, నూతన ఓపీ రిజిస్ట్రేషన్ సెంటర్లను ఎమ్మెల్సీ ఇసాక్ బాషాతో కలిసి ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మాట్లాడారు. పేద ప్రజలకు కార్పోరేట్ వైద్యం అందించేందుకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని తెలిపారు. స్పెషలిస్ట్ వైద్యులు, వైద్య సిబ్బందిని అన్ని వేళాలా అత్యవసర సేవలను అందించేందుకు అందుబాటులో ఉంచామన్నారు. నాడు ప్రభుత్వ హాస్పటల్ల్ పరిస్థితిని, నేడు వైసిపి ప్రభుత్వం హయాంలో హాస్పటల్ పరిస్థితిని ప్రజలకు తెలియజేయాలని వైద్య అధికారులను కోరారు. త్వరలో నంద్యాలలో నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. రానున్న కాలంలో అన్ని సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మెడికల్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మంచి ఫలితాలతో ఉత్తీర్ణత సాధించి, నంద్యాల కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. భవిష్యత్తులో నంద్యాలలోనే అన్ని చికిత్సలకు వైద్య సేవలను అందించే రీతిలో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ఫెడ్ ఛైర్మన్ పీపీ నాగిరెడ్డి, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, దృశ్యకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ డాక్టర శశికళారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబున్నీసా, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వరప్రసాద్, డిసిహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ మహబూబ్ బాష, కౌన్సిలర్లు సమ్మద్, తబ్రేజ్, వైసిపి నాయకులు రహంతుల్లా, అమృతరాజ్, శివనాగిరెడ్డి, జలీల్ బాషా, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల సత్వర చికిత్స కేంద్రం ప్రారంభం అనంతరం వసతులను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

కేంద్ర పథకాలపై అవగాహన

ప్రజాశక్తి - రుద్రవరం : మండలంలోని ముత్తలూరు, నరసాపురం గ్రామాలలో శనివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్నిఈ వోపీఆర్డి శ్రీనివాస శర్మ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపడుతున్న ఉచిత బియ్యం, ఉచిత గ్యాస్, పిఎం కిసాన్, పీఎం యోవజన పథకం కింద గృహ నిర్మాణాలు, బాలికలకు సుకన్య సమృద్ధి యోజన, వైద్యం, పంటల బీమా, వంటి తదితర పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పంటలకు మందులు పిచికారి చేసే డ్రోన్లపై రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు పాములేటి, ప్రభాకర్ గ్రామ సర్పంచులు, ఆయా శాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలోని 13వ వార్డులో రూ. 26 లక్షలతో సిసి రోడ్డు, డ్రైనేజీలు, 14వ వార్డులో రూ. 35 లక్షలతో డ్రైనేజీలను ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, మున్సిపల్ చైర్మన్ మభూన్నిసాలు శనివారం ప్రాంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 14వ వార్డులో మరో రూ. 45 లక్షలతో డ్రైనేజ్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి పనులు వేగవంతంగా చేపడుతున్నామని, త్వరలో పూర్తి చేసి ప్రజలకు డ్రైనేజ్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వంలో నంద్యాల పట్టణాభివృద్ధి ఎంతో శరవేగంగా చెందుతుందని చెప్పారు. ప్రజల సౌకర్యార్థం సొంత స్థలంలో డ్రైనేజ్ ఏర్పాటుకు స్థలం అందించిన శివనాగిరెడ్డి ఉదారతకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. మరో మూడు నెలల కాలంలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నంద్యాల నియోజకవర్గ ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. మంచి చేసిన వైసిపిని ప్రజలు ఆశీర్వదించాలని, తనకు మళ్లీ అవకాశం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు గంగిశెట్టి శ్రీధర్, పంషావలి, కౌన్సిలర్లు విమలమ్మ, కాల్వ సరస్వతి, వార్డు ఇన్చార్జిలు సోమశేఖర్ రెడ్డి, నాగరాజు, నాయకులు రామసుబ్బయ్య, ప్రసాదయ్యా, నాగరాజు, 13వ వార్డు నాయకులు టివై శివయ్య, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చక్రవర్తి, సత్యమయ్య, గెలివి రామకృష్ణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మున్సిపల్ చైర్మన్

సాహిత్యానికి పట్టుగొమ్మ నంద్యాల

- 'శూన్యపు మనసులో చిగుర్లు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - నంద్యాల

కళ,సాహిత్య రంగాలలో నంద్యాలకు ప్రత్యేకస్థానం ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. కవి కొప్పుల ప్రసాద్ రచించిన 'శూన్యపు మనసులో చిగుర్లు' పుస్తకావిష్కరణ సభ శనివారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల మినీ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సాహితీ స్రవంతి అధ్యక్షులు శ్రీనివాసమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా బాలసాహితీ వేత్త డాక్టర్ హరికిషన్, కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.రవికృష్ణ, సూరన సారస్వత సంఘం అధ్యక్షులు డాక్టర్ గెలివి సహదేవుడు, ఎన్జీవో నాయకులు మణి శేఖర్ రెడ్డి, హుస్సేన్ రెడ్డి, రోటరీ క్లబ్ ప్రతినిధులు డివి.సుబ్బయ్య, చింతల మోహన్ రావు, వైష్ణవ వెంకట రమణమూర్తి, అన్నెం శ్రీనివాస రెడ్డి, నరేంద్ర తదితరులు హాజరై పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.రవికృష్ణ మాట్లాడుతూ కళ, సాహిత్య రంగాలలో నంద్యాలకు ప్రత్యేకస్థానం ఉందని వర్ధమాన కవి 'కొప్పుల' కవితా రచనలు సామాజిక ప్రయోజనంతో కొనసాగడం హర్షణీయమన్నారు. శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ నంద్యాల్లో కవులను, రచయితలను ప్రోత్సహించడంలో సాహితీ స్రవంతి ముందుంటుందని తెలిపారు. డాక్టర్ హరికిషన్ పుస్తక సమీక్ష చేశారు. పుస్తక రచయిత కొప్పుల ప్రసాద్ మాట్లాడుతూ సమాజాన్ని జాగృతం చేయాలన్న తపనతో నిరంతరం అక్షర ప్రవాహాన్ని కొనసాగిస్తున్నానని తెలిపారు. సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో సాహితీవేత్తలు కవి 'కొప్పుల'ను ఘనంగా సత్కరించారు. అనంతరం నిర్వహించిన 'నంద్యాల కవులు – సాహిత్యం' అంశంపై జరిగిన చర్చలో కవులు నీలకంఠమాచారి, మాబుబాషా, గద్వాల రామకృష్ణ, ఎద్దు ప్రసాద్, లలితా సరస్వతి, భవాని లీలావతి, రఫీ ,మద్దిలేటి , కన్నయ్య, గోపాల్, మధుసూదన్ తదితరులు పాల్గొని తెలుగు భాషా సాహిత్యాన్ని సుసంపన్నం చేయడానికి ఉపాధ్యాయులు, సాహితీ సంస్థలు కృషి చేయవలసిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

పుస్తకం ఆవిష్కరణ చేస్తున్న దృశ్యం

ఘనంగా లయన్స్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ జయంతి

ప్రజాశక్తి - నంద్యాల

అంతర్జాతీయ లయన్స్ సేవా సంస్థ వ్యవస్థాపకులు మెల్విన్ జోన్స్ జయంతిని శనివారం నంద్యాలలోని వికలాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో లయన్స్ క్లబ్, వికలాంగుల సంక్షేమ సంఘం సంయుక్త నిర్వహణలో ఘనంగా నిర్వహించారు. ముందుగా మెల్విన్ జోన్స్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గోళ్ల రాజేంద్రప్రసాద్ (రాజేష్) సౌజన్యంతో రూ. 20 వేల విలువ చేసే చంక కర్రలు 20 మంది వికలాంగులకు, ఐదుగురు వికలాంగ విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వికలాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, లయన్స్ క్లబ్ అధ్యక్షులు పీవీ సుధాకర్ రెడ్డిలు మాట్లాడుతూ మెల్విన్ జోన్స్ స్థాపించిన అంతర్జాతీయ లయన్స్ సేవా సంస్థ ద్వారా ప్రపంచంలోని అన్ని దేశాలలో వేలాది క్లబ్బుల ద్వారా కోట్లాదిమందికి సేవా కార్యక్రమాలు గత 100 సంవత్సరాలకు పైగా జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి సోమేశుల నాగరాజు, కోశాధికారి మామిళ్ల నాగరాజు, జోన్ చైర్మన్ చంద్రమోహన్, జిల్లా చైర్మన్ ఎంపివి.రమణయ్య, ఎలుకూరి మురళీమోహన్, యూసుఫ్, వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఆత్మకూరు పిఎస్ పరిధిలో కార్డెన్ సెర్చ్

- 20 లీటర్ల నాటు సారా సీజ్

ప్రజాశక్తి - ఆత్మకూరు

బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

జిల్లా ఎస్పి ఆదేశాలమేరకు ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో శనివారం నాడు తెల్లవారు జామున ఆత్మకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎమ్. నాగభూషణ్ ఆధ్వర్యంలో సిద్ధాపురం గ్రామ పొలిమేరల్లో చేసిన కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. సోదాలు చేసి రెండు ప్రదేశాలలో ఇద్దరి వ్యక్తులకి చెందిన సుమారు 900 లీటర్ల ఫర్మెంట్డ్ వాష్ (బెల్లం వూట), 20 లీటర్ల నాటు సారాయి స్వాధీనం చేసుకున్నారు. సారా బట్టిని, బెల్లం వూటని ధ్వంసం చేసి సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. ఈ ఆపరేషన్‌లో ఆత్మకూరు సెబ్ సిఐ నాయుడు, ఆత్మకూరు ఎస్ఐలు కృష్ణమూర్తి, నారాయణ రెడ్డి, వెలుగోడు ఎస్ఐ ప్రసాద్, పాములపాడు ఎస్ఐ అశోక్, కొత్తపల్లి ఎస్ఐ హుస్సేన్ బాషా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ నాటుసారాను ఎవరైనా తయారు చేసినా,అమ్మినా కఠిన చర్యలు తప్పవని అన్నారు.

ఆత్మీయ సదస్సుకు తరలిన ముస్లిములు

ఆత్మీయ సదస్సుకు వెళ్తున్న ముస్లింలు

ప్రజాశక్తి -ప్యాపిలి

డోన్‌లో సాయి ఫంక్షన్ హాల్లో జరిగే మైనార్టీల ఆత్మీయ సదస్సుకు ఎమ్మెల్సీ షరీఫ్ హాజరువు తున్న సందర్భంగా మండలంలోని ముస్లిం సోదరులు శనివారం తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఖాజాపీర్, ఎస్‌కె వలి, మహబూబ్ బాషా, అక్బర్ మాట్లాడుతూ ముస్లిం, మైనారిటీల సంక్షేమాన్ని కాంక్షించేది టీడీపీ మాత్రమేనని అన్నారు. కార్యక్రమంలో కరెంటు బాషా,ముస్తఫా,ఇమ్రాన్ ఖాజా,రహిమాన్, తబ్రెజ్,హనీఫ్, రఫీ రహిమాన్, మాబాషా, హుస్సేన్ పీరా, తాజుద్దీన్, దాదు, ఫారూక్,ఖాదర్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి ఆదాయం రూ.2.60 లక్షలు

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ పరిధిలో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి లక్ష్మీ నరసింహ స్వామి వారి ఈ శనివారం ఆదాయం రూ.2,60,290 ఆదాయం వచ్చినట్లు ఈవో పాండురంగారెడ్డి, ఆలయం చైర్మన్ సీతారామ చంద్రుడు తెలిపారు. స్వామివారి దర్శనం టికెట్లు ,కేశఖండనం, రూము బాడుగలు, స్వామి వారి ప్రసాదం, చిరు వ్యాపారస్తుల సుంకం వసూలు మొదలగు వాటిపైన రెండు లక్షల అరవై వేల 290 రూపాయలు ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. నంద్యాల జిల్లా పాణ్యాం మండలం తమ రాజు పల్లి గ్రామానికి చెందిన శ్రీ ఆంజనేయస్వామి మోడరన్ రైస్ మిల్ యజమాని వై రంగయ్య స్వామి వారి ఆలయం అభివృద్ధి కోసం 50వేల రూపాయలను ఈవో పాండురంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడికి ఇచ్చినట్లు తెలిపారు.

దశాబ్దాలుగా రాయలసీమ అన్యాయానికి గురవుతోంది

- 'రాయలసీమ నీటి ప్రాజెక్టులు - భవిష్యత్ కార్యాచరణ' సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - నందికొట్కూరు

దశాబ్దాలుగా రాయలసీమ అన్యాయానికి గురవుతోందని వక్తలు పేర్కొన్నారు. శనివారం నాడు ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నందికొట్కూరు పట్టణంలోని కిసాన్ పార్క్ నందు "రాయలసీమ నీటి ప్రాజె క్టులు - భవిష్యత్ కార్యాచరణ" అనే అంశంపై సదస్సు జరిగింది. జాతీయ బిసి సంక్షేమ సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షులు కురుమూర్తి అధ్యక్షత వహించిన ఈ సదస్సుకు వక్తలుగా విరసం బాధ్యులు పాణి, రాయలసీమ విద్యా వంతుల వేదిక కో కన్వీనర్ భాస్కర రెడ్డి, కార్యవర్గ సభ్యులు రత్నం ఏసేపు హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దశాబ్దాల తరబడి రాయలసీమ అన్యాయానికి, మోసానికి గురై పోతూవుందని, అధికారంలోకి వచ్చిన అన్ని పార్టీలు రాయలసీమకు ద్రోహం చేస్తున్నారని ధ్వజమెత్తారు. వందల టీఎంసీ ల నీరు వృధాగా సముద్రంలో కలిసిపోతుందనీ, అన్ని ప్రభుత్వాలు రాయల సీమ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తూవున్నాయని, ఫలితంగా రాయలసీమలో కరువులు, వలసలు ఏర్పాడుతున్నాయన్నారు. నందికొట్కూరు ప్రాంతం నుండే అన్ని ప్రాజెక్టులకు నీరు వెళ్తూ వున్నా, ఈ ప్రాంతం లోనే పంటలకు సాగునీరు లేదని, ఎన్నో త్యాగాలు చేసిన ఈ ప్రాంతం యువతకు ప్రస్తుతం ఉపాధులు లేవన్నారు. తక్షణమే రాయలసీమ పెండింగ్ ప్రాజెక్ట్ లను పూర్తి చేయాలని, గుండ్రేవుల రిజర్వాయర్, సిద్దేశ్వరం అలుగు నిర్మాణాలను పూర్తి చేయాలని, నీటి కేటాయింపులు వున్న ఆర్డీఎస్ కుడి కాలువ, వేదవతి ప్రోజెక్టు నిర్మాణా లను చేపట్టాలని కోరారు. సీమ ప్రజలు ఈ ప్రాంత నీటి ప్రాజెక్టుల పట్ల అవగాహనను పెంచుకోవాలని, తమ తమ ప్రజా ప్రతినిధులను సీమ సమస్య లపై నిలదీసి ప్రశ్నించాలని, రాబోయే ఎన్నికల్లో సీమ సమస్యలు పార్టీల మ్యానిఫెస్టోలలో చేర్చేలా ఉద్యమించాలన్నారు. అనంతరం 'నీటి అవగాహనే రాయలసీమకు రక్ష' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఇంకా ఈ నాటి సదస్సులో అఖిల భారత రైతు సమాఖ్య జిల్లా కార్యదర్శి నరసింహులు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్, జిల్లా కార్యదర్శి రఘురామమూర్తి, డీటీఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షులు కిషోర్, సమాచార హక్కు ప్రచార ఐక్య వేదిక నాయకులు జయరామ్, శోభారాణి, ఆంజనేయులు, బాలరాముడు, శ్రీనివాసులు, నారాయణ, చిన్న, ఆనంద్ ఇతర రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

సంతాపం తెలుపుతున్న సిపిఎం నాయకులు

కొంగర రమణాలుకు సిపిఎం నాయకులు సంతాపం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

సిపిఎం నేత కొంగర రమణాలు (70) మృతికి సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు ఎం నాగేశ్వరరావు, సిపిఎం నాయకులు కే భాస్కర్ రెడ్డి, పి ఫకీర్ సాహెబ్ నివాళ్లు అర్పించారు. శనివారం నాడు నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామానికి నాయకులు చేరుకొని ఆయన భౌతిక ఆయనకి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎం నాగేశ్వరావు మాట్లాడుతూ కొంగర రమణాలు కొణిదెల గ్రామంలో భూస్వాములకు వ్యతిరేకంగా, గని కార్మికుల సంక్షేమం కోసం పనిచేశారన్నారు. సిపిఎం నేతగా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడిగా అనేక సంవత్సరాలు ఉద్యమాల్లో పనిచేశారని వారు గుర్తుచేశారు. ఆయన కుమారుడు కొంగర వెంకటేశ్వర్లు ప్రస్తుతం వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకుడిగా పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణ, గ్రామస్తులు రమణ, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి

- కెవిపిఎస్ జిల్లా అధ్యక్షురాలు రంగమ్మ

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

కర్నూలు జిల్లా దేవనకొండ మండలం పి కోటకొండ గ్రామంలో ఐదు సంవత్సరాల బాలికను అత్యంత పాసివికంగా అత్యాచారం చేసిన నేరస్తుడిని కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షురాలు రంగమ్మ డిమాండ్ చేశారు. శనివారం జూపాడుబంగ్లా కెవిపిఎస్ ఆధ్వర్యంలో సమావేశంలో వారు మాట్లాడుతూ చిన్న పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడిన వారిని బహిరంగ ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకురాలు కాసియా బేగం ఐద్వా జిల్లా నాయకురాలు నవశాని, జయరాణి, రాణమ్మ, సంతోషమ్మ, సుశీలమ్మ, మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు ప్రారంభం

భోగి మంటలను వెలగిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడు కే.శే. నాగార్జునరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను శనివారం నిర్వహించారు. ఈ పోటీలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆయన సతీమణి జయమ్మ, వారి కోడలు కాటసాని మేధా శ్రీరెడ్డి ప్రారంభించారు. పోటీలకు విచ్చేసిన వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన ఏర్పాట్లు ఎమ్మెల్యే కాటసాని దంపతులు చేశారు. విజేతలకు మొదటి బహుమతి రేణుకకు డబుల్ డోర్ రిఫ్రిజిరేటర్, రెండవ బహుమతి భారతికి సింగిల్ డోర్ రిఫ్రిజిరేటర్, మూడవ బహుమతి ఇంద్రవతికి ఎల్ఈడి టీవీ, నాల్గవ బహుమతి అంజనమ్మకు వాషింగ్ మిషన్, ఐదవ బహుమతి నీరజకు రైస్ కుక్కర్‌లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ, కోడలు కాటసాని మేధా శ్రీరెడ్డిలు అందచేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, యాగంటి దేవస్థానం చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, బానుముక్కల సొసైటీ చైర్మన్ నీలి శ్రీనివాసులు, ఎంపిపి మానస వీణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ గరుడ దీవెనమ్మ, పట్టణ సర్పంచ్ ఈసారి ఎల్లమ్మ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గాధం శెట్టి వేణుగోపాల్, నాయ కులు డాక్టర్ రవి కుమార్, శ్రీరామ సుబ్రహ్మణ్యం, బింగి మళ్ళ హనుమాన్ శెట్టి, గుండా శ్రీనివాసులు, జక్కా నాగరాజు, వంకదారి గోపాల్, మారుతి రవికుమార్, ఆర్యవైశ్యమహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు సుప్రజ, పట్టణ అధ్యక్షురాలు స్వర్ణలతలు పాల్గొన్నారు.

భోగి మండలం వెలిగించిన ఎమ్మెల్యే కాటసాని : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆయన సతీమణి కాటసాని జయమ్మ, వారి కోడలు కాటసాని మేధా శ్రీరెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. కాటసాని జయమ్మ, కాటసాని మేధా శ్రీ రెడ్డిలు, మహిళలు భోగిమంటల ముందు నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజల ందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగ భాగ్యా లు తెచ్చే సంబరాల పండుగ సంక్రాంతి అన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఇంటికి వచ్చే తరుణమని చెప్పారు. వైసిపి మండల కన్వీనర్ సన్నల జనార్దన్ రెడ్డి, ఎంపిపి మానస వీణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ గరుడ దీవెనమ్మ, పట్టణ సర్పంచి ఈసారి ఎల్లమ్మ, నాయకులు కుమ్మరి సురేష్ బాబు, కాటసాని రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

17న అంతర్ రాష్ట్ర పాలబండ పోటీలు

ప్రజాశక్తి - కొత్తపల్లి

ఈనెల 17న మండల కేంద్రంలో అంతర్ రాష్ట్ర స్థాయి పాల బండ (6.6 పండ్లలోపు) పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు రమణారెడ్డి శ్రీనివాసులు యాదవ్, సి శ్రీనివాసులు యాదవ్, లింగారెడ్డిలు శనివారం తెలిపారు. శ్రీ తాండవ మల్లేశ్వరస్వామి తిరునాల సందర్భంగా బైరెడ్డి సిద్ధార్థరెడ్డి యువసేన, గ్రామపెద్దల సమక్షంలో అంతర్ రాష్ట్ర స్థాయి పాలబండ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీలలో పాల్గొను వృషబాల యజమానులు 17వ తేది ఉదయం 7:30 గంటలలోపు రూ.500 ప్రవేశరుసుము చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలని చెప్పారు. ఈ పోటీలలో గెలుపొందిన వృషభాలకు మొదటి బహుమతి రూ.50వేలు ధాత శాప్ చైర్మన్, వైఎస్సార్సీపీ రాష్ట్ర యుజన విభాగం అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, రెండవ బహుమతి రూ.30 వేలు జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, మూడవ బహుమతి రూ.20 వేలు సి యమ్ ఆగ్రో ఏజెన్సీ. స్వరాజ్ ట్రాక్టర్ షోరూమ్ వారు, నాల్గవ బహుమతి రూ.10 వేలు సింగిల్ విండో చైర్మన్ గౌరు జనార్ధన్ రెడ్డి, ఐదవబహుమతి రూ.5వేలు గజ్జల వెంకట రమణ యాదవ్, ఆరవ బహుమతి రూ.3వేలు తెలుగు అశోక్‌లు ఇవ్వనున్నట్లు వివరించారు. పూర్తి వివరాలకోసం 9177069826, 7093873824, 6305585189, 8247224985 అనే నంబర్లు సంప్రదించాలన్నారు.

ముచ్చుమర్రి ఎస్ఐగా జయ శేఖర్

ప్రజాశక్తి - పగిడ్యాల

ముచ్చుమర్రి ఎస్సైగా జయ శేఖర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. జయ శేఖర్ ఆదోని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ముచ్చుమర్రి ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న నాగార్జున బ్రాహ్మణకొట్కూరు ఎస్సైగా బదిలీపై వెళ్లారు. ఎస్సై నాగార్జున 2021 అక్టోబర్ 18న బాధితులు చేపట్టారు.

మౌలాలి స్వామి సరిగెత్తును ఘనంగా నిర్వహించుకుందాం : సర్పంచి

ప్రజాశక్తి - గడివేముల

కొలువైన మౌలాలి స్వామి

మండలంలోని కోర్రపోలురు గ్రామంలో ఈనెల 15,16 తేదీలలో గ్రామస్తులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలన హాకారంతో మూలలిస్వామి సరిగెత్తు వేడుకలను ఘనంగా నిర్వహించుకుందామని గ్రామ ప్రజలను సర్పంచ్ మాలిక్ బాషా కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు అందరు ఐక్యమత్తంగా ఉండి వేడుకలను చేసుకోవాలన్నారు.

గడ్డివాము దగ్ధం

ప్రజాశక్తి - పాములపాడు

మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పాములపాడు గ్రామంలోని రైతు వెంకటేశ్వర్లుకు చెందిన గడ్డివాము దగ్ధమైంది. స్థానికుల వివరాల మేరకు వెంకటేశ్వర్లు రెండు ఎకరాల గడ్డిని కొనుగోలు చేసి పశు గ్రాసం కొరకు వాము వేసు కున్నాడు. శనివారం గడ్డివాము అంటుకో వడంతో స్థానికులు నీళ్లతో ఆర్పే ప్రయత్నం చేశారు. ఆత్మకూరు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు. రైతు వెంకటేశ్వర్లకు సుమారు రూ.30 వేల దాకా నష్టం వాటిల్లింది ప్రమాదానికి కల కారణం ఆకతాయిల పనే ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది ఎస్ఎఫ్ఓ భీముడు నాయక్, ఐఎఫ్ కరిముల్లా, డిఆర్ఓపి మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తకు పరామర్శ

ప్రజాశక్తి - చాగలమర్రి

పరామర్శిస్తున్న భార్గవరామ్

మండలంలోని పెద్దవంగలి గ్రామంలో ఇటీవలే అపరేషన్ చేయించుకున్న టిడిపి కార్యకర్త ఆదిశేషయ్యను ఆళ్లగడ్డ నియోజక వర్గ భార్గవరామ్ పరామర్శించారు. విషయం తెలుసుకున్న భార్గవరామ్ శనివారం గ్రామానికి చేరుకోని కాలుకు శస్త్ర చికిత్స చేయించుకన్న ఆదిశేశయ్యని పరామర్శించి త్వరగా కోలుకోవాలని కోరారు. ఆయన వెంట టిడిపి నాయకులు నాగేంద్ర, సంజీవరాయుడు, మహబూబ్ బాష, తదితరులు ఉన్నారు.

బేతంచర్ల : మాట్లాడుతున్న జి శేబారాణి, చిత్రంలో జనసేన పార్టీ నాయకులు చల్లా మద్దిలేటి

పగిడ్యాల : ఉరి వేసుకుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

బెదిరిస్తే మూల్యం తప్పదు

ప్రజాశక్తి - విలేకరులు

నంద్యాల కలెక్టరేట్ : అంగన్వాడీలకు వేతనాలు పెంచకుండా విధుల్లో చేరాలని ప్రభుత్వం బెదిరింపులకు దిగితే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు, ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నిర్మలమ్మ, ప్రాజెక్ట్ కార్యదర్శి బి.సునీత, జిల్లా నాయకురాలు నాగరాణి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అంగన్వాడీల నిరవధిక సమ్మె శనివారం 33వ రోజు కొనసాగింది. నంద్యాల జిల్లా కేంద్రంలో అంగన్వాడీలు బూడిద గుమ్మడికాయలు పగలకొట్టి ప్రభుత్వంపై నిరసన తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శిస్తుం దన్నారు. చర్చలకు పిలిచి ఆర్థిక పరమైన అంశాలను పరిష్కరిం చలేమని మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు దాటవేసే ధోరణితో వ్యవహరించడం, సమ్మెను విరమించాలని, విధుల్లో చేరాలని లేకుంటే ప్రత్యామ్నాయం చూసుకుంటామని బెదిరించే ధోరణిలో మాట్లాడడం తగదన్నారు. తక్షణమే అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సెక్టార్ లీడర్స్ ప్రసన్న, సరస్వతి, నీలిమ, లలితమ్మ, సునీత, వరలక్ష్మి, సారమ్మ, సావిత్రీ, అరుణ, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు. **రుద్రవరం :** రుద్రవరం తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీల సమ్మె కొనసాగినది. మండలంలోని అంగన్వాడీ టీచర్లు, ఆయాలు అందరూ నిరసన దీక్షశిబిరంలో పాల్గొన్నారు. సిఐటియు జిల్లా నాయకులు బాల వెంకట్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, అంగన్వాడి నాయకురాళ్లు మనోజ, పద్మావతి, బీబి, రాజ్యలక్ష్మి , తిరుపా లమ్మ, లలితమ్మ మాట్లాడారు. **బనగానపల్లె :** పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయావరణలో అంగన్వాడీల సమ్మె కొనసాగింది. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎల్లయ్య, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి రోజా రమణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అంగన్వాడీల పట్ల నిరంకుశ ధోరణి అవలంభిస్తుందని, ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. సిఐటియు డివిజన్ కార్యదర్శి జెవి సుబ్బయ్య, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సభ్యులు తులసి, పద్మ, సుకన్య, వరలక్ష్మి, సుమలత, చంద్రకళ, మల్లేశ్వరి, రమదేవి తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్:** తహశీల్దార్ కార్యాలయం దగ్గర 33వ రోజు సమ్మె చేపట్టి మట్టి తింటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి మంజుల, నాయకురాలు లక్ష్మిదేవి, సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యాక్షులు రణధీర్‌లు మాట్లాడారు. యూనియన్ నాయకురాలు ప్రమీలమ్మ, విజయలక్ష్మి, వెంకటలక్ష్మి, రవణమ్మ, చెన్నమ్మ, అంగన్వాడీలు, సీఐటీయు నాయకులు సురేంద్ర, పాల్గొన్నారు. **పాములపాడు :** మండలంలో అంగన్వాడీలు మార్చుకోవాలని కోవాలని సంక్రాం తి ముగ్గులు వేసి నిరసన తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు శివలక్ష్మి, నాగమణి, నాగ మద్దమ్మ, రమణ బాయ్, శ్రీలత, టీచర్స్ అండ్ హెల్పర్స్ పాల్గొన్నారు. **పగిడ్యాల :** స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో అంగన్వాడి కార్యకర్తలు ఉరితాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె భాస్కర్ రెడ్డి తదితరులు మాట్లాడారు. **బేతంచర్ల :** అంగన్వాడీలపై ఎస్మా చట్టం అమలు చేయడం దుర్మార్గమని జనసేన పార్టీ బేతంచెర్ల మండల కన్వీనర్ చల్లా మద్దిలేటి, అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు జి శేబారాణిలు అన్నారు. 33 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు వారు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నాగరాజు, మద్దయ్య నాయుడు, నవీన్, రాజు, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** నందికొట్కూరు పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. కార్యక్రమానికి అంగన్వాడి నాయకురాలు మదార్ బి అధ్యక్షత వహించారు. సమస్యలను పరిష్కరించేంత వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. **జూపాడు బంగ్లాలో** తాసిల్దార్ ఆఫీస్ వద్ద నాయకులు వెంకట రమణమ్మ, గురుదేవి అధ్యక్షతన సమ్మెను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు సామన్న, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కర్ణ, అంగన్వాడీ వర్కర్స్ నాయకులు లలితమ్మ, లక్ష్మీదేవి పాల్గొని మాట్లాడారు. అనంతరం కేసి కెనాల్ వరకు ర్యాలీగా బయలుదేరి నీళ్లలో దిగి నిరసన తెలిపారు. **బండి ఆత్మకూరు :** అంగన్వాడీ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు హెల్పర్లు కళ్లకు గంతలు కట్టుకొని మోకాళ్లపై నిలబడి తమ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నాయకులు వెంకటరమణమ్మ, ఆనందమ్మ, వసంత, శ్యామల మాట్లాడారు. సిఐటియు మండల కార్యదర్శి రత్నమయ్య, సిఐటియు నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

బండి ఆత్మకూరు : కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతన్న దృశ్యం

జనసేన పార్టీలో చేరిన ప్రముఖ న్యాయవాది

ప్రజాశక్తి - ఆళ్ళగడ్డ

పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది పత్తి సబ్బరామి రెడ్డి శనివారం జనసేనలో చేరారు. మంగళగిరి లోనీ కేంద్ర కార్యాలయంలో పిఏసి ఛైర్మెన్ నాదెండ్ల మనోహర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆమంచి శ్రీనివాసులు సమ క్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియో జకవర్గంలో పార్టీనీ బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

జనసేనలో న్యాయవాది పత్తి సబ్బరామి రెడ్డి

మల్లన్న సన్నిధిలో తెలంగాణ హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి - శ్రీశైలం

మకర సంక్రమణాన్ని పురస్కరించుకొని శ్రీశైలక్షేత్రంలో జరుగుతున్న సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో స్వామి అమ్మవారిని శనివారం నాడు తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మీనారాయణ అలిశెట్టి కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వీరు స్వామీ అమ్మ వాళ్ళని దర్శించుకునేందుకు ఆలయ రాజగోపురం వద్దకు చేరుకోగా ఆలయ అధికారులు ఆలయ సంప్ర దాయం ప్రకారం స్వాగతం పలికారు. స్వామివారి దర్శనంతరం అమ్మవారిని దర్శించుకోవడం జరిగిందని ఆలయ అధికారులు తెలిపారు.


మల్లన్నను దర్శించుకున్న హైకోర్టు జడ్జి

పేదలను దగా చేసిన జగన్ రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్థన్ రెడ్డి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

భవిష్యత్తు గ్యారెంటి పథకాలను ప్రజలకు వివరిస్తున్న బీసీ జనార్ధన్ రెడ్డి

సంక్రాంతి కానుక ఇవ్వకుండా పేదలను సిఎం జగన్ రెడ్డి దగా చేశారని, రాష్ట్రమంతా జగన్ రెడ్డి తీరును, పెత్తందారి పోకడలను వైసిపి ఎమ్మెల్యేలు, ఎంపీలే బహిరంగంగా ఎండగడుతు న్నారని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి విమర్శించారు. శనివారం కొలిమి గుండ్ల మండలంలోని పెట్నీకోట, మీర్జాపురం, ఇటిక్యాల గ్రామాలలో బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేకు స్థానిక టిడిపి నాయకులు నాగిరెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు పెట్నీకోట గొంగటి హుస్సేన్ రెడ్డి, యాతం సత్యనారాయణ రెడ్డి, నారాయణ రెడ్డిలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల దృష్టిని మళ్లించే ందుకు జగన్ జేబు సంస్థలాగా వ్యవహరిస్తున్న సిఐడిని అడ్డం పెట్టుకొని చంద్రబాబుపై కక్ష సాధింపు చర్యలకు, నీలి మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా 6 భవిష్యత్తు గ్యారెంటి పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఐవి పక్కిరెడ్డి, మండలాధ్యక్షుడు ఎం రామేశ్వర్ రెడ్డి, నంద్యాల ప్రసాద్, ఎస్ రామ్మోహన్, తెలుగు యువత అధ్యక్షులు పెట్నీకోట గొంగటి హుస్సేన్ రెడ్డి, యాతం సత్యనారాయణ రెడ్డి, నాగార్జున రెడ్డి, నారాయణ రెడ్డి, మీర్జాపురం చిన్నపురెడ్డి, రామకృష్ణ, వేణుగోపాల్ రెడ్డి, ఇటిక్యాల శివ రెడ్డి, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్ ఆత్మకూరు.
ఐ పి నంబర్. 01/2024.

పార్నపల్లె మాబుసా, వయసు 73 సం".
తండ్రి బాషు మియా, ముస్లిం, కూలి. ఇంటి నెంబర్. 11-74, జెండా వీధి, వెలుగోడు గ్రామము మరియు మండలం నంద్యాల జిల్లా. -పిటిషనర్

ఎదురే

గునిపాటి సుంకిరెడ్డి మరియు ఇతరులు ... రెస్పాండెంట్స్.

1) గునిపాటి సుంకిరెడ్డి వయసు 46 సం". తండ్రి జి. రామిరెడ్డి హిందూ, వ్యాపారం, ఆర్/ఓ.డోర్ నెంబర్ 11-12.పెద్ద దేవాలయం వీధి వెలుగోడు గ్రామము వెలుగోడు మండలం నంద్యాల జిల్లా
2). గునిపాటి స్వామి రెడ్డి వయసు 46 సం". తండ్రి జి. రామిరెడ్డి, హిందూ, వ్యాపారం, ఆర్/ఓ.డోర్ నెంబర్ 12- 12. పెద్ద దేవాలయం వీధి వెలుగోడు గ్రామము వెలుగోడు మండలం నంద్యాల జిల్లా
3). అల్లే క్రిష్ణా రెడ్డి వయసు 50 సం". తండ్రి అల్లే నారాయణ రెడ్డి, హిందూ, వ్యాపారం, ఆర్/ఓ.డోర్ నెంబర్. 11- 20. జెండా పేట, వెలుగోడు గ్రామము వెలుగోడు మండలం నంద్యాల జిల్లా.
4). మిడుతూరు నాగలక్ష్మి వయసు 50 సం ". వైఫ్/ అఫ్ లవ కుమార్. హిందూ, హౌస్ వైఫ్. ఆర్/ఓ.డోర్ నెంబర్. 2-30. మిడుతూరు గ్రామము, మిడుతూరు మండలం, నంద్యాల జిల్లా.
5). కంసాలి చంద్రుడు వయసు 45 సం". తండ్రి సుబ్బన్న, హిందూ, వ్యాపారం, ఆర్/ఓ.డోర్ నెంబర్ 17-123. వేంపెంట రోడ్డు, లక్ష్మీ నగర్, వెలుగోడు గ్రామము, వెలుగోడు మండలం నంద్యాల జిల్లా.
6). గద్వాల వెంకటేశ్వర్లు వయసు 51 సం". తండ్రి గద్వాల చిన్న తిరుపాలు హిందూ, వ్యాపారం. ఆర్/ఓ.డోర్ నెంబర్. 12- 104, పెద్ద దేవాలయం వీధి, వెలుగోడు గ్రామము, వెలుగోడు మండలం, నంద్యాల జిల్లా.
7). కొత్త కురువ చిన్న బిరన్న వయసు 40 సం". తండ్రి. కొత్త కురువ నడిపెన్న, హిందూ, వ్యాపారం. ఆర్/ఓ.డోర్ నెంబర్ 9-84, తెలుగు పేట, వెలుగోడు గ్రామము, వెలుగోడు మండలం, నంద్యాల జిల్లా.
8). గాజుల వెంకటేశ్వర్లు వయసు 40 సం". తండ్రి జి. మిరియాల వెంకట రాముడు. ఆర్/ఓ.డోర్ నెంబర్ 12-30, పెద్ద దేవాలయం వీధి, వెలుగోడు గ్రామము, వెలుగోడు మండలం, నంద్యాల జిల్లా.
9). కృష్ణాపురం మహేష్ వయసు 39 సం". తండ్రి. కే నాగన్న, హిందూ, వ్యాపారం. ఆర్/ఓ.డోర్ నెంబర్ 12-101, పెద్ద దేవాలయం వీధి, వెలుగోడు గ్రామము, వెలుగోడు మండలం నంద్యాల జిల్లా.
10). వరలక్ష్మి వయసు 49 సం". వైఫ్ /ఆఫ్. హుస్సేన్ రెడ్డి, హిందూ, వ్యాపారం. ఆర్/ఓ.డోర్ నెంబర్ 13-50, గంగ బావి వీధి, వెలుగోడు గ్రామము, వెలుగోడు మండలం, నంద్యాల జిల్లా.
11) కావేటి పుల్లయ్య వయసు 50 సం". తండ్రి. కే సుబ్బారాయుడు, హిందూ, వ్యాపారం. ఆర్/ఓ.డోర్ నెంబర్ 7-82, సుంకులమ్మ వీధి, వెలుగోడు గ్రామము, వెలుగోడు మండలం, నంద్యాల జిల్లా.
12) షేక్ రషీద్ వయసు 49 సం". తండ్రి. షేక్ బాషు, ముస్లిమ్, బ్లాక్ స్మిత్, ఆర్/ఓ.డోర్ నెంబర్ 6-21, బిహేండ్ గ్రామపంచాయతీ ఆఫీస్, వెలుగోడు గ్రామము మరియు వెలుగోడు మండలం, నంద్యాల జిల్లా.
13) షేక్ బాషా వయసు 35 సం". తండ్రి ఖాసిం సాహెబ్, ముస్లిం, గవర్నమెంట్ ఎంప్లాయ్ ఇన్ ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్. ఆర్/ఓ.డోర్ నెంబర్ 1-1354-1, హెచ్.బి.ఎస్. కాలనీ ఎమ్మిగనూరు టౌన్, కర్నూల్ జిల్లా - 518360.
14) జ్యోతి వయసు 35 సం". వైఫ్ /ఆఫ్. జనార్ధన్, డాటర్/ ఆఫ్. లక్ష్మీదేవి, హిందూ, హౌస్ వైఫ్. ఆర్/ఓ.డోర్ నెంబర్. 19-354, సిపి నగర్, వెలుగోడు గ్రామము, వెలుగోడు మండలం, నంద్యాల జిల్లా.
15) చిత్రాల రామకృష్ణ వయసు 45 సం".తండ్రి చిత్రాల రామయ్య, హిందూ, ప్రొప్రయిటర్ విజయ ట్రేడర్స్, మెయిన్ రోడ్, ఆపోజిట్ జెడ్ పి హైస్కూల్, వెలుగోడు గ్రామము వెలుగోడు మండలం, నంద్యాల జిల్లా.

పబ్లిక్ నోటీసు.

నంద్యాల జిల్లా వెలుగోడు, మిడుతూరు, ఎమ్మిగనూరు, గ్రామ ప్రజలకు తెలియ జేయడమేమనగా పైన నెంబర్ అర్జీ దారుడు పార్నపల్లె మాబుసా అను నతడు తనను దివాలాదారుగా తీర్మానించమని కోరుతూ పైకోర్టులో దివాలా అర్జీ దాఖలు చేసినాడు. ఇందు మూలముగా ఎవరికైనా ఆక్షేపనులు ఉన్న తేదీ. 30 - 1 - 2024. పగలు 10: 30 గంటలకు పై కోర్టులో మీరు గాని మీ లాయర్ ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకోవచ్చు. లేని యెడల మీ పరోక్షమున తీర్మానం చేయబడును.

కోర్టు వారి ఉత్తర్వులు మేరకు

వాయిదా తేదీ : 30-1-2024

సయ్యద్ సిద్ధిక్ అహ్మద్,
బి ఏ ఎల్ ఎల్ బి.,
అడ్వకేట్, ఆత్మకూరు.
సెల్ నెంబర్ : 9985192803